జల సంరక్షణ చర్యలపై కేంద్రం ప్రశంసం

● కలెక్టర్‌ను అభినందిస్తూ లేఖ

నెల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో జల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలకు కేంద్ర ప్రభుత్వం ప్రశంసించింది. కలెక్టర్ హిమాన్షు శుక్లా నేతృత్వంలోని అధికార యంత్రాంగాన్ని అభినందిస్తూ ప్రతిష్టాత్మకమైన జల సంచాయ్-జన్ భగీరథి అవార్డును ప్రకటించింది. గడిచిన ఏడాది కాలంలో జిల్లాలో నీటి వనరులను సంరక్షించడం, నీటి వృథాను అరికట్టడం, ప్రజలతో అవగాహన కల్పిస్తూ వారిని భాగస్వామ్యం చేయడంతో కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డుకు జిల్లాను ఎంపిక చేసింది. ఈ మేరకు కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి అర్చనావర్మ కలెక్టర్‌కు ప్రశంసా లేఖను పంపించారు. ఈ అవార్డు అందుకున్న సందర్భంగా రూ.25లక్షల నజరానా కూడా కేంద్రం జిల్లాకు అందించనుంది. భవిష్యత్‌లోనూ ఇదే స్ఫూర్తితో జల సంరక్షణకు చర్యలు తీసుకోవాలంటూ ఈ లేఖలో సూచించింది. ప్రతిష్టాత్మకమైన కేంద్ర ప్రభుత్వ అవార్డు జిల్లాకు దక్కడంపై అధికార వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.



ఆంధ్రజ్యోతి పరిశీలన

ఇది నెల్లూరు-ముంబయి జాతీయ రహదారి. నిత్యం వేలాది వాహనాలు ఈ రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తుంటాయి. అలాంటి రద్దీ ఉన్న రోడ్డుపై ఏర్పడిన గోతులు వాహనదారులను ప్రమాదాలపాలు చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చిన్న గుంతలు పెద్ద గోతులుగా మారి చెరువులను తలపిస్తున్నాయి.

- సంగం (ఆంధ్రజ్యోతి)

గుంత.. విప్పండి కళ్లకు గంత!

● ఎగుడు దిగుడు రోడ్లపై అవస్థల ప్రయాణం
● ఇటీవల కురిసిన వర్షాలకు మరింత ఛిద్రమైన రహదారులు

- వివరాలు 8లో..



శివం.. శంకరం!

కార్తీక మాసంలో విశిష్టమైన రోజు పౌర్ణమి. ఇది శివ కేశవులకు ఎంతో ప్రీతిపాత్రమైంది. ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో బుధవారం జరుపుకునే ఈ పర్వదినానికి జిల్లాలోని అన్నీ ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. శివాలయాల్లో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, కార్తీక దీపారాధనలు, నూనెలో చంద్రబింబం వీక్షణ.. తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వైష్ణవాలయాల్లో సామూహిక సత్యనారాయణ వ్రతాలు, తులసి అర్చనలు, శ్రీవారి కల్యాణాలు నిర్వహిస్తారు.

- వివరాలు 6లో..

● శివకేశవులకు ప్రీతిపాత్రం 'కార్తీక పౌర్ణమి' ● నేడు జిల్లావ్యాప్తంగా వేడుకలు ● విస్తృత ఏర్పాట్లు

'సోమశిల' నీటిమట్టం

అనంతసాగరం నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి మంగళవారం ఎగువ నుంచి 17,592 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దిగువకు 12,650, ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. డ్యాంలో 70.182 టీఎంసీలు నిల్వ ఉంది.

నేడు లంకా దినకర్ రాక : రేపు విస్తృత తనిఖీలు

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : 20 అంశాల కార్యక్రమ అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ బుధవారం నెల్లూరుకు వస్తున్నారని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6గంటలకు నెల్లూరుకు చేరుకుని అతిథి గృహంలో బస చేస్తారని తెలిపారు. గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు జిల్లాలో ఆకస్మిక తనిఖీలు చేస్తారని తెలిపారు. పీఎంశ్రీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, మధ్యాహ్న భోజన పథకం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను దినకర్ తనిఖీ చేస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య కలెక్టరేట్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై అధికారులతో సమీక్ష ఉంటుందని తెలిపారు.

రిలయన్స్‌పై నీలినీడలు

కృష్ణపట్నంలో 2,630 ఎకరాల కేటాయింపు

16 ఏళ్ల తరువాత ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు సన్నాహాలు

ఒకటి కాదు.. రెండు కాదు.. దాదాపు 2630 ఎకరాల భూములు. అందులోనూ ఇప్పటికి 16 ఏళ్లు. పరిశ్రమలు పెడతారని, ఉపాధి దొరుకుతుందని ఎదురుచూసిన స్థానికులకు నిరాశే ఎదురైంది. చాన్నాళ్లకు పరిశ్రమల ఏర్పాటులో కదలిక వస్తుందని సంతోషించేలోపు మళ్లీ నిరాశే ఎదురయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీ దేశవ్యాప్తంగా ఉన్న అనీల్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆస్తులను సీజ్ చేసిన నేపథ్యంలో కృష్ణపట్నంలో రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయదలచిన మెగా ఇండస్ట్రియల్ పార్కుపై నీలినీడలు కమ్ముకున్నాయి.


కృష్ణపట్నంలో రిలయన్స్‌కు కేటాయించిన భూములు

అంబానీ ఆస్తులను సీజ్ చేసిన ఈడీ
పార్కు ఏర్పాటుపై సందిగ్ధత

నెల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముత్తుకూరు మండలం కృష్ణపట్నం పరిసర గ్రామాల్లో థర్మల్ పవర్‌ప్లాంటు ఏర్పాటు కోసం 2009లో రాష్ట్ర ప్రభుత్వం 2,630 ఎకరాలను రిలయన్స్ కోస్టల్ ఆంధ్ర ప్రాజెక్టుకు అప్పగించింది. అప్పట్లో భూసేకరణ ధర తక్కువగా ఉన్నప్పటికీ, పరిశ్రమల ఏర్పాటుతో తమ బతుకులు మారుతాయని, భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకువచ్చారు. కానీ ఆ తరువాత ఆ ప్రాజెక్టులో పురోగతి లేదు. సంవత్సరాలు గడుస్తున్నా, పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడంతో స్థానికుల్లో ఆందోళన మొదలైంది. అనేకమార్లు ప్రభుత్వాలు రిలయన్స్ సంస్థకు నోటీసులు ఇచ్చినా ఫలితం దక్కలేదు. అయితే గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఈ భూములకు మోక్షం కలిగింది. రిలయన్స్ యాజమాన్యంతో ప్రభుత్వం చర్చలు జరపడంతో కృష్ణపట్నంలోని 2,630 ఎకరాల్లో గ్రీన్ హైడ్రోజన్ తయారీ ప్లాంటును నెలకొల్పేందుకు రిలయన్స్ సంస్థ సుముఖత వ్యక్తం చేసింది. ఆ క్రమంలోనే ఈ ఏడాది జనవరిలో అనీల్ అంబానీ కృష్ణపట్నం వచ్చి భూములను పరిశీలించారు. భారీ పిచ్చిమొక్కలతో మారిపోయిన భూములు శుభ్రం చేయించారు. అయితే ప్రస్తుత పరిస్థితులలో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు లాభతరం కాదని, ఆ స్థానంలో శ్రీసిటీ తరహాలో మెగా ఇండస్ట్రియల్ పార్కును రిలయన్స్ సంస్థ ప్రతిపాదించింది. ఇందుకు సంబంధించి రూ.1800కోట్లతో డెవలప్‌మెంట్ పనులు చేయనున్నట్లు తెలిసింది. రానున్న పదేళ్లలో ఇక్కడ స్థాపించబోయే పరిశ్రమల ద్వారా సుమారు 20వేల ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేసింది. ఈ మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు సంబంధించి అనుమతులకై ఇటీవల రిలయన్స్ యాజమాన్యం ప్రభుత్వానికి దరఖాస్తులు చేసుకుంది. ఈ క్రమంలో రిలయన్స్ సంస్థపై ఈడీ విచారణ జరుగుతుండడంతో, ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదని పరిశ్రమల శాఖ వర్గాల ద్వారా తెలిసింది. అయితే ఇప్పుడు ఏకంగా ఈడీ రూ.7500 కోట్ల విలువైన అనీల్ అంబానీ ఆస్తులను సీజ్ చేయడంతో కృష్ణపట్నంలో మెగా ఇండస్ట్రియల్ పార్కు పనులు ముందుకు సాగేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్‌ను సంప్రదించగా ప్రస్తుత పరిస్థితులలో మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు అనుమతులు ఇచ్చే అంశం ప్రభుత్వం దృష్టిలో ఉందని చెప్పారు.


కాంట్రాక్టర్ చేపట్టిన బేస్‌మెంట్ నిర్మాణానికి కొలతలు తీస్తున్న విజిలెన్స్ అధికారులు (ఫైల్)

అవినీతిని నిర్ధారించినా..

నిర్లక్ష్యమేలా!?

గత ప్రభుత్వంలో నాసిరకంగా ఇళ్ల నిర్మాణాలు
విజిలెన్స్ విచారించి ఏడాది పూర్తి
అయినా చర్యలు లేవు.. నగదు రికవరీ లేదు!

గత వైసీపీ హయాంలో హౌసింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు ఒక్కటై నాసిరకంగా ఇళ్లు నిర్మించి రూ.లక్షల ప్రజాధనాన్ని స్వాహా చేశారు. అయితే, ప్రస్తుత ప్రభుత్వం గతంలో జరిగిన ఇళ్ల నిర్మాణాలు, నిధులు స్వాహాపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. అయితే, ఉదయగిరి మండలం కొండాయపాళెం పంచాయతీ గంగిరెడ్డిపల్లి లోని జగనన్న లేఅవుట్‌లో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి ఏడాది కావస్తున్నా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

అధికారులు బిల్లులు మంజూరు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని, లేదంటే శాఖాపరమైన చర్యలు తప్పవని ఇటీవల అధికారులు కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేసినా వారిలో చలనం లేదు.

ఉదయగిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గంగిరెడ్డిపల్లి లేఅవుట్‌లో ఆప్షన్-3 కింద ఇద్దరు కాంట్రాక్టర్లు లబ్ధిదారుల ఒప్పందంతో హౌసింగ్ అధికారులు 2023లో 141 మంది లబ్ధిదారుల ఇళ్లు నిర్మించేలా తీర్మానం చేశారు. అయితే, 141 మంది లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి బీఎల్-122, ఆర్ఎల్-11, ఆర్‌సీ-5, ఎల్ఎల్-1 స్థాయిలో ఉండగా 2 ఇళ్లను పూర్తి చేశారు. బేస్‌మెంట్‌లు, ఇళ్ల నిర్మాణాలు నాసిరకంగా ఉంటున్నా అప్పటి అధికారులు పట్టించుకొన్న దాఖలాల్లేవు.

● నిబంధనలకు విరుద్ధంగా..

నిబంధనలకు విరుద్ధంగా హౌసింగ్ అధికారులు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారనే ఆరోపణలు ఉన్నాయి. పూర్తిస్థాయిలో నిర్మించకుండానే ఒక్కో బేస్‌మెంట్‌కు రూ.70 వేలు చొప్పున రూ.98.70 లక్షలు కాంట్రాక్టర్లకు జమ చేశారు. అలాగే రూ.18 లక్షల విలువైన సిమెంట్, స్టీల్ అందజేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా నిర్మాణాలు చేపట్టి మరో రూ.5 లక్షలు చెల్లించడంతోపాటు స్టీల్, ఇనుము మంజూరు చేశారు. పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేపట్టకుండానే మామూళ్ల మత్తులో

● ఏడాది గడుస్తున్నా..

గంగిరెడ్డిపల్లి లేఅవుట్‌లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై గతేడాది సెప్టెంబరులో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. నిర్మాణాలు నాసిరకంగా చేపట్టడంతోపాటు కొలతల్లో భారీ వ్యత్యాసాలు ఉన్నాయని గుర్తించారు. కాంట్రాక్టర్లకు అదనంగా రూ.58.20 లక్షలు పేమెంట్ చేశారని, వారి నుంచి రికవరీ చేయాలని అధికారులకు నివేదిక అందజేశారు. అయితే ఏడాది కావస్తున్నా ఇంతవరకు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోకపోవడంతోపాటు నగదు రికవరీ చేయలేదు. ఈ వ్యవహారం వెనుక హౌసింగ్ అధికారుల తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కేసులు నమోదు చేస్తాం

గత ప్రభుత్వంలో ఆప్షన్-3 కింద చేపట్టిన గృహ నిర్మాణాలను కాంట్రాక్టర్లు పూర్తి చేయకపోతే లబ్ధిదారుల చేత పోలీసులకు ఫిర్యాదు చేయించి కేసు నమోదు చేసేలా చర్యలు చేపడతాం. ఇటీవల కాంట్రాక్టర్లకు నోటీసులు సైతం జారీ చేశారు.

- టీ.వేణుగోపాల్, గృహ నిర్మాణ శాఖ పీడీ

విభేదాలు ఎందుకున్నాయ్!

జనసేన నాయకులతో మాటామంతీ
వివరాలు సేకరించిన ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి శివశంకర్
త్వరలో జనసేనాని పవన్‌కు నివేదిక

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : 'రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి మంచి పేరుంది. నాయకులు, కార్యకర్తల్లోనూ సఖ్యత ఉంది. మరి నెల్లూరులో మాత్రం వర్గవిభేదాలు ఎందుకున్నాయ్!? ఇందుకు కారణాలు ఏమిటి!?. ఏం చేస్తే అందరూ గాడిన పడతారు.' అనేక అంశాలపై జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంఎస్ఎంఈ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ ఆ పార్టీ ముఖ్యనేతలతో సుదీర్ఘంగా చర్చించారు. జనసేన ఆవిర్భావం నుంచి జిల్లాలో వర్గపోర్లు నడుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, ఆపార్టీ అధినేత పవన్‌కల్యాణ్ డిప్యూటీ సీఎంగా రాష్ట్రంలో ఉన్నా జిల్లాలో మాత్రం వర్గపోరును నివారించలేక పోతున్నారు. ఇటీవల రెండు వర్గాలు ఒకరిపై మరొకరు ప్రత్యక్షంగా మీడియాకు ఎక్కడంతో పవన్‌కల్యాణ్ సీరియస్ ఆయ్యారు. ఈ క్రమంలో ఇరు వర్గాల నాయకులను గత నెల 28, 29 తేదీలలో మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయానికి పిలిపించుకుని క్లాస్ తీసుకున్నారు. అలాగే, జిల్లాలో జరుగుతున్న రచ్చపై పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్‌ను విచారణకు ఆదేశించారు.

● నాయకులతో సుదీర్ఘ చర్చలు

ఇందులో భాగంగా ఈ నెల 2వ తేదీ రాత్రి నెల్లూరుకు చేరుకున్న శివశంకర్ సోమ, మంగళవారాలలో జిల్లాలోని ప్రతి నియోజక వర్గానికి చెందిన నాయకుల తోపాటు పార్టీకి విధేయంగా, గతంలో చురుక్కుగా పని చేసిన వారిని సైతం పిలిపించి మాట్లాడారు. అసలు జిల్లాలో ఏం జరుగుతోంది.. ఎందుకు ఇంతలా వర్గపోరు నడుస్తోంది.. నాయకుల మధ్య సఖ్యత కుదర్చాలంటే ఏం చేయాలి తదితర వాటిపై సుదీర్ఘంగా

- మిగతా 6లో..

గండికోట సుధీర్ కుమార్‌కు ప్రశంసాపత్రం

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నన్నయ విశ్వవిద్యాలయం, ఉన్నత్ భారత్ అభియాన్ నిర్వహించిన జాతీయ సదస్సులో తెలుగు సాహిత్యంలో పరిశోధనా పత్రం అందజేసిన బుచ్చి మున్సిపాలిటీ రామచంద్రాపురం పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్ కుమార్‌కు ప్రశంసాపత్రం లభించింది. మంగళవారం నెల్లూరులో దవ్వూరు రామిరెడ్డి విజ్ఞాన సమితి ట్రస్టు, పొణకా కనకమ్మ ఆశయసాధన సమితి ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంతరెడ్డి, చలంచర్ల భాస్కర్‌రెడ్డి గండికోటకు ప్రశంస పత్రం అందజేశారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11572
వెండి కిలో ధర	రూ. 150300
వెండి ఒక గ్రాము	రూ. 156.30

సాగు ఖర్చుపై రైతులు దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఆత్మ డిప్యూటీ డైరెక్టర్ మురళి

కోవూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు ఖర్చుపై దృష్టి సారించాలని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) డిప్యూటీ డైరెక్టర్ మురళి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఛాంపియన్ రైతుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నూతన సాంకేతిక యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించాలన్నారు. వరి సాగులో మెళకువలను వివరించారు. నారుమడి యాజమాన్య పద్ధతులు, తెగుళ్ళ నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం ఇందిరావతి, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు శ్రీలక్ష్మి, మధుసూదన్, వ్యవసాయాధికారులు అనిత, మారుతీ దేవి, మేరీ కమల, ఆసిమా, ఇఫ్కో మేనేజరు లక్ష్మీనారాయణ తదితరులు మాట్లాడారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన

కొడవలూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొడవలూరు పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఏఐ కార్యక్రమంపై అవగాహన సదస్సు జరిగింది. కళాశాల చైర్మన్ డాక్టర్ పి గుణశేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పట్ల ప్రతి ఒక్కరు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ జయలక్ష్మి విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నా స్థలం కబ్జా చేశారు!

రాపూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన విశ్రాంత ఉద్యోగి సయ్యద్ అబ్దుల్ జబ్బార్ అనే 40 సెంట్ల భూమి కబ్జా చేశారని, రెవెన్యూ శాఖ నుండి తగిన స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. పట్టణంలోని లక్ష్మీపురంలో 827-1 సర్వే నెంబర్ లో 40 సెంట్ల మాగాణి తన తండ్రి పిత్రార్జిత భూమిని పఠాన్ ఎక్బాల్ అలిఖాన్ పేరుగా ఆక్రమించుకొని రికార్డులను మార్చారని తెలిపారు. ఈ భూమి అతని తండ్రి సయ్యద్ గౌస్ సాహెబ్ పేరు మీద వెబ్ ల్యాండ్ నందు నమోదు అయ్యిందని, భూమి ఖాతా నెంబరు 132 ఉండగా, ఎటువంటి పత్రాలు లేకపోయిన ఆ నెంబరును 2734 మార్చారని తెలిపారు.

వృద్ధులను ఆదరించాలి

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వృద్ధులను ఆదరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని విజ్ఞాన సరోవర ప్రచురణ అధ్యక్షుడు హైదరాబాదుకు చెందిన కొండా లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. మంగళవారం నెల్లూరు పాత మున్సిపల్ కార్యాలయంలోని వృద్ధాశ్రమంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తల్లిదండ్రులతో పాటు ఇతర వృద్ధులను ఆదరించేందుకు ముందుకు రావాలని కోరారు. చలి కాలం అయినందువల్ల వృద్ధుల కోసం తమ సొంత నిధులతో రగ్గులు తేవడం జరిగిందని తెలిపారు. అనంతరం వాటిని అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, అంకయ్యచౌదరి, ఏ.జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలి

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసే నిర్ణయం సరైనది కాదని కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న అన్నారు. వైద్య కళాశాలలకు వ్యతిరేకంగా వైసీపీ కోటి సంతకాల కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని మునులపూడి పంచాయతీ రెడ్డిపాళెంలో నిర్వహించారు. ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ప్రైవేటీకరణను నిరసిస్తూ ఈనెల 11న కోవూరులో జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచు పీవీ రమణారెడ్డి, కడివేటి శ్రీనివాసులురెడ్డి, షాహుల్, చలపతి, ఎం. శ్రీనివాసులురెడ్డి, జి. విజయ్‌కుమార్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సహస్ర కళాభిషేకం

రాపూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో మంగళవారం మూలవర్లకు సహస్ర కళాభిషేకం నిర్వహించారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా వేద పండితులు ద్వారా మహా పూర్ణాహుతి నిర్వహించారు. స్వామి అమ్మవారి ఉత్సవ మూర్తులను సహస్ర కళాభిషేకం (1001) కలశాలతో నింపిన సుగంధ ద్రవ్యా లు, పవిత్ర జలాలతో శాస్త్రోక్తంగా అభిషేకించారు. భక్తులు వీక్షించి ఆనందపరవశులయ్యారు. ఈ క్రతువు ఆలయ ఉపకమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో ఈ మహా క్రతువును నిర్వహించారు.

నరకప్రాయం.. ఈ దారిలో ప్రయాణం!



గంతలమయంగా మారిన బుచ్చి, చెన్నూరు రోడ్డు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ పరిధిలోని మలిదేవి కాలువ దగ్గర్నుంచి మండలంలోని రెడ్డిపాళెం వరకు బుచ్చి, చెన్నూరు రోడ్డులో 7 కిలో మీటర్ల దూరం మేర చినుకుపడితే చిత్తడే నన్న చందంగా తయారైంది. గత 7 ఏళ్ళుగా బస్సులలో ప్రయాణమంటేనే గర్భిణులకు నొప్పులు రాకుండానే కాన్పు అయ్యే పరిస్థితి.. అని ఇక్కడి ప్రజల్లో ఆవేదన వ్యక్తమౌతోంది. ఇక నిత్యం ఆటోలు, ద్విచక్రవాహనాలలో ప్రయాణించే మహిళలు, వృద్ధుల పరిస్థితి దారుణం. ఈ మార్గంలో ప్రయాణమంటే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఈ మార్గంలో రోడ్డు నిర్మాణం పూర్తి చేయించి ప్రమాదాల నుంచి తప్పించాలని ప్రజలు కోరుతున్నారు.

బుచ్చి, దగదర్తి రోడ్డు నిర్మాణం పూర్తయ్యేనా...?

గత 7ఏళ్ళ క్రితం జగన్ సర్కార్‌లో బుచ్చినుంచి దగదర్తి వరకు సుమారు 35 కోట్లతో రోడ్డు విస్తరణతోపాటు గ్రామాలలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లకు టెండర్లు నిర్వహించారు. 2019లో అగ్రిమెంటు చేసుకున్న టెండరుదారుడు బుచ్చి మండలం పరిధిలో బుచ్చి నుంచి రెడ్డిపాళెం వరకు వున్న రోడ్డు తవ్వేసిన కాంట్రాక్టరు ఏడేళ్ళైనా కొత్త రోడ్డు నిర్మించే ఊసే లేదు. దీంతో కొంతమేర బాగున్న రోడ్డును తవ్వేసి కంకర తోలి సరిపెట్టడంతో రోడ్డంతా గోతులమయంగా తయారైంది. దీంతో బుచ్చి పెద్దూరులో కొంత, కట్టుబడిపాళెం గ్రామంలో కొంత మొత్తం సుమారు కిలోమీటరు దూరం సీసీరోడ్లు, దగదర్తిలో కొంత మేర రోడ్లు నిర్మించి చేతులు దులుపుకున్నారనే విమర్శలున్నాయి. దీంతో ఈ రహదారి కోసం ఏడేళ్ళుగా ప్రజలకు ఎదురు చూపులే మిగిలాయి. సుమారు రూ.15 కోట్లుమేర రోడ్డు నిర్మాణం చేపట్టిన గుత్తేదారుకు ఓవైపు ప్రజాప్రతినిధులకు ఇచ్చిన కమిషన్లు, మరోవైపు పెట్టిన పెట్టుబడులకు వడ్డీలు వెరసి రోడ్డు నిర్మాణం చేయలేక కాంట్రాక్టర్ చేతులెత్తేశాడనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఇటీవల ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి రూ.14 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు సమాచారం. అయితే ఆ నిధులు గుత్తేదారు ఖాతాకు జమైన వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టను న్నట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ నాగరాజు తెలిపారు. బుచ్చి-చెన్నూరు రోడ్డు నిర్మాణ పనుల్లో ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగినందున ఈ విషయమై నోటీసులు కూడా జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

యూరియా గురించి ఆందోళన వద్దు!



యూరియా బస్తాలు అందిస్తున్న వ్యవసాయాధికారులు, టీడీపీ నాయకులు

వెంటాచలం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పార్టీలక తీతంగా రైతులందరికీ యూరియా అందిస్తామని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చౌటపాళెం పీఏసీఎస్ చైర్మన్ రావూరి రాధకృష్ణమ నాయుడు అన్నారు. మండ లంలోని గొలగమూడి గ్రామం లో మంగళవారం రైతులకు యూరియా బస్తాలు, కార్డులు అందజేశారు. చైర్మన్ మాట్లాడుతూ నియోజక వర్గంలో రైతుల సమస్యలపై ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. యూరియా విషయంలో రైతులు దిగులుపడాల్సిన పనిలేదన్నారు. అనంతరం వ్యవసాయాధికారులు రైతులకు యూరియా కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ శ్రీదేవి, ఏవో హరికరుణాకర్ రెడ్డి, సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జునరెడ్డి, పీఏసిఎస్ డైరెక్టర్ ఆస్తోటి నాగరాజు, టీడీపీ నాయకులు పాకాల శ్రీనువాసులు, కొర్రకూటి పార్థసారధి, శ్రీనువాసులు, మనోహర్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

విశాఖ పట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

విడవలూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పవిత్రమైన కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సముద్ర తీరానికి స్నానాలు ఆచరించటానికి విచ్చేసే భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోస్టల్ సెక్యూరిటీ ఇన్‌చార్జీ, విశాఖ పట్నం రేంజ్ డీఐజి గోపీనాథ్ జట్టి తెలిపారు. ఈ మేరకు మెరైన్ అధికారులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ సముద్ర తీరంలో మెరైన్ పోలీసులు భక్తులకు, సందర్శకులకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సముద్రంలో బోట్లు ఏర్పాటు చేసి భక్తులు, సందర్శకులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ప్రమాదవశాత్తు ఒక్కరు మరణించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీఎం చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం

కొడవలూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షే మమే ధ్యేయంగా ముఖ్య మం త్రి చంద్రబాబు కృషి చేస్తున్నా రని రాష్ట్ర పౌర సరఫరాల డైరె క్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి అన్నారు. మండలంలో గండవ రం గ్రామంలో రాష్ట్రీయ గోకు లమిషన్ ఆధ్వర్యంలో మెగా పశు వైద్య శిబిరం మంగళ వారం జరిగింది. ఈ కార్యక్రమం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి రమేష్‌నాయక్ మాట్లాడుతూ పెయ్య దూడల ఉత్పత్తి పథకంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న పశుగ్రాసాల అభివృద్ధి, మినీ గోకులం గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ అధికారులు రసూలు, జ్యోతి, వెంకటేశ్వర్లు, నీటి సంఘం అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చెకుముకి పరీక్షలు

మనుబోలు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి పరీక్షలను నిర్వహించారు. ఈ పోటీలలో పలుపాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలలో విజేతలయిన వెంకటాద్రి, వర్షిణీకావ్య, సురేఖలకు పాఠశాల హెచ్‌ఎం. అమూల్యకుమారి చేతులమీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జేవివి మండలఅధ్యక్షుడు బి. శ్రీనువాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాపూరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో రాపూరు మండలంలోని గవర్నమెంట్ బాయ్స్ హైస్కూల్ వేదికగా నిర్వహించిన "చెకుముకి సంబరాలు - 2025 సైన్స్ ఫెస్ట్" మండల స్థాయి పోటీల్లో జెమ్స్ స్కూల్ విద్యార్థినులు ఎస్. గీతిక, ఎస్.జోషిత, ఎం.కీర్తన సత్తా చాటారు. విద్యార్థినులు ఈ కార్యక్రమంలో సీనియర్ గవర్నమెంట్ ఉపాధ్యాయులు పి.హరిప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందుకున్నారు. నవంబరు 23న జరగబోయే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని జెమ్స్ స్కూల్ కరస్పాండెంట్ బులగాకుల మునేంద్ర రెడ్డి తెలిపారు.

కోవూరు: స్థానిక జేబీఆర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జనవిజ్ఞాన వేదిక నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక మండల కమిటీ అధ్యక్షుడు రహంతుల్లా మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలనే లక్ష్యంతో పోటీల్ని నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచు కోవాలన్నారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు శ్రీహరి బహుమతుల్ని అందించారు. కార్య క్రమంలో జనవిజ్ఞాన వేదిక మండల కమిటీ కార్యదర్శి శ్రీశైల మాట్లాడారు.

చట్టాలపై విద్యార్థినులకు అవగాహన

నెల్లూరు(క్రైం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాలికలు, మహిళల చట్టాలపై నగరంలోని జెండావీధిలో ఉన్న పీఎస్‌ఎం పాఠశాలలో చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌పై, పోక్సో కేసులపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే తల్లిదండ్రులకు తెలియజేసి పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సామాజిక మద్యమాల్లో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకొని మోసపోవద్దని, చదువుపై దృష్టి సారించాలని కోరారు. బాలికల చట్టాల గురించి తెలుసుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసుల అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

పొదలకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 10న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని 1వార్డు 1వ ఎంపీటీసీ సెగ్మెంట్ పరిధిలో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె అంజాద్ తెలిపారు. వారం రోజులపాటు వివిధ రకాల సేవ, క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అంజాద్ తెలిపారు. అందులో భాగంగా మంగళవారం పట్టణంలోని టైలర్స్ కాలనీలోని అంగన్‌వాడీ స్కూల్‌లోని చిన్నారులకు ప్లేట్లు, గ్లాసులు, స్పూన్‌లు, ఆటవస్తువులు అందించారు. ఈ కార్యక్రమంలో మండలం పరిషత్ కోఆప్షన్ సభ్యులు షేక్.దస్తగిరి, మాజీ వార్డు మెంబరు షేక్.దిల్షాద్, స్థానిక వైసీపీ నాయకులు జమీర్, కేసెంరెడ్డి భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కుటుంబాలకు చేయూత

కోవూరు, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): ఇటీవలి భారీ వర్షాలకు నష్టపోయిన చేనేత కుటుంబాలకు ప్రభుత్వం సాయం అందించనుందని చేనేత సంఘం నాయకుడు కేవీ శేషయ్య తెలిపారు. పాటూరులోని చేనేత కుటుంబాల్ని ఆయన మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కుటుంబాలకు అదనంగా ఒక్కో కుటుంబానికి 50 కిలోల బియ్యం అందించమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కలెక్టరు హిమాన్షు శుక్లాకు విజ్ఞప్తి చేశారని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని 2500 కుటుంబాలకు బియ్యం, చక్కెర, ఉల్లిపాయలు, కందిపప్పు అందించేందుకు పౌర సరఫరా శాఖ ద్వారా అందించేందుకు సిద్ధం చేశారన్నారు. చేనేత కుటుంబాల సమస్యల్ని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

రాపూరులో ఆత్మ నిర్భర్ భారత్

రాపూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాపూరు పట్టణంలో తెలుగు గంగ కార్యాలయంలో ఆత్మనిర్భర్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటా స్వదేశీ, ప్రతి ఇంటా స్వదేశీ వస్తువుల వాడకం తప్పనిసరి అని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ అన్నారు. ఈ కార్యక్రమం ప్రతి గ్రామానికి చేరుకోవాలని ఆయన సూచించారు. అనంతరం అందరిచేత స్వదేశీ వస్తు విక్రయాలు చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. బీజేపీ వెంకటగిరి నియోజకవర్గ అధ్యక్షులు ఎస్‌ఎస్ నాయుడు మాట్లాడుతూ భారత ప్రధాని పిలుపునిచ్చిన ఆత్మ నిర్భర్ భారత్ వలన దేశం ఆర్థికంగా బలోపేతం అవడమే కాకుండా, స్వదేశీ వస్తువుల తయారీ, వాడకం ద్వారా స్థానిక ఉత్పత్తులు తయారు చేసే ఉత్పత్తిదారులు లబ్ధి పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు దూడల పెంచలయ్య, వెంకటరత్నం నాయుడు, జయసింహ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వేలిముద్ర వేయించుకుని నగదు స్వాహా

విడవలూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వేలు ముద్రలు వేసుకుని గృహనిర్మాణ శాఖ పథకం కింద మంజూరైన నగదుని అలగానిపాడు గ్రామంలోని పోస్టాఫీసులో బ్రాంచ్ పోస్టు మాస్టర్ గా పని చేస్తున్న ఓ మహిళ స్వాహా చేసిందని విడవలూరు పంచాయతీ జాన్ పేటకి ,చెందిన వృద్ధురాలు ఆత్మకూరు కమలమ్మ ఆరోపించారు. విడవలూరులో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జాన్‌పేటలో నివాసం ఉంటున్న స్వప్న అలగానిపాడు గ్రామంలో బీపీఎంగా పని చేస్తూ తనకు ఎంతో విధేయంగా ఉండేదన్నారు. విడవలూరు పోస్టాఫీసులో ఉన్న తన ఖాతాకి ప్రతినెల రూ. వెయ్యి కట్టేదానినని, ఆ నగదుని స్వప్న చేతికి ఇచ్చేదాన్నని తెలిపారు. స్వప్న మీద ఉన్న నమ్మకంతో ఆమె ఎప్పుడు వేలిముద్ర వేయమన్నా వేసిదానని ఇదే అదునుగా భావించిన స్వప్న గృహ నిర్మాణ పథకం కింద పోస్టాఫీసు ఖాతాలో జమైన సుమారు రూ.1 లక్షా 30 వేలు తనకు గ్యాస్ సిలిండర్ సబ్సిడీ పడిందని నమ్మించి తనచేత వేలిముద్రలు వేయించుకుని డ్రా చేసుకుందని వాపోయారు. తనకు జరిగిన అన్యాయంపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశానన్నారు.

నార్లకు సిద్ధం కావాలి

మనుబోలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతుసేవాకేంద్రం-2లో వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు కృషి విజ్ఞానకేంద్రం నుంచి శాస్త్రవేత్త డా. లోకేష్‌బాబు హాజరయ్యారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని, నాట్లు వేసేందుకు రైతులు సిద్ధం కావా లన్నారు. అయితే బీపీటి 5204 రకం వేయ దలచిన రైతులు ఈనెల 15లోగా వేసుకో వాలన్నారు. కేఎన్‌ఎం 1638, షుగర్‌లెస్ ఆర్ ఎన్ ఆర్ 15048 వరి వంగడాలు 15వ తేదీ తరువాత నుంచి డిసెంబరు 15లోగా వేసుకోవాలని సూచించారు.

పాజర్లకు ఎమ్మెల్యే సోమిరెడ్డి నివాళి

మనుబోలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వెంకన్నపాళెం సీనియర్ టీడీపీ నాయకులు పాజర్ల జగన్‌మోహన్‌రెడ్డి (68) అనారోగ్యంతో సోమవారం రాత్రి చనిపోయారు. దీంతో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మంగళవారం వెంకన్నపాళెం చేరుకుని జగన్‌మోహన్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి ఎమ్మెల్యే తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, నాయకులు మేదెరమెట్ల హనుమంతనాయుడు, శేఖర్ నాయుడు, అడపాల శివకుమార్‌రెడ్డి, శానంపూడి సురేంద్ర రెడ్డి, దండు చంద్రశేఖర్‌రెడ్డిలు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

శివం.. శంకరం!

- శివకేశవులకు ప్రీతిపాత్రం 'కార్తీక పౌర్ణమి'
- నేడు జిల్లావ్యాప్తంగా వేడుకలు
- ముస్తాబైన ఆలయాలు.. పకడ్బందీగా ఏర్పాట్లు



వీఆర్సీ మైదానంలో కార్తీక పౌర్ణమి ఏర్పాట్లు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : లోక కల్యాణం కోసం మహాశివుడు, శ్రీమన్నారాయణుడు దుష్టసంహారాలు చేసినరోజు కార్తీక పౌర్ణమి. శివకేశవుల కలయికతో కార్తికేయుడి జననం, తారకాసురుడి వధ ఒక ఘట్టం కాగా, తారకాసురుడి ముగ్గురు కుమారులను మహాదేవుడు వధించడం కూడా కార్తీకపౌర్ణమి రోజే జరిగిందని పురాణ కథనం. ఈ రోజున శివాలయాల్లో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహిస్తే కోటిజన్మల పుణ్యఫలం లభిస్తుందని హిందువుల విశ్వాసం. ధ్వజస్తంభం వద్ద నందాదీపం పేరిట దీపం పెట్టడం, నూనె పాత్రలో చంద్రదర్శనం చేసుకోవడం శుభప్రదం. వైష్ణవ ఆలయాల్లో సత్యనారాయణ వ్రతాలు, విశేష అభిషేకాలు, ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా హరిహర మహాదేవ శంభోశంకర.. అంటూ 365 ఒత్తుల దీపం వెలిగిస్తే ఏడాది పొడవునా చేసిన శివపూజకు సమానమైన ఫలితం ఇస్తోంది. కార్తీక పౌర్ణమి నాడు సూర్యోదయానికి ముందే నదులు, చెరువుల్లో స్నానాలు ఆచరించి, శివకేశవులకు రుద్రాభిషేకాలు, రుద్రపూజ, అమ్మవారికి లక్ష కుంకుమార్చన, బిల్వదళార్చన చేస్తారు. మహిళలు రాత్రికి అరటిదొనెల్లో దీపాలు వెలిగించి నదులు, చెరువుల్లో వదులుతారు. ఇదేరోజున కేదారేశ్వర వ్రతాలను కూడా ఆచరిస్తారు. పౌర్ణమి తిథి మంగళవారం రాత్రి 10.30 గంటలకు ప్రారంభమై బుధవారం సాయంత్రం 6.48 గంటల వరకు ఉంటుంది. బుధవారం వేకువజామున 4.52 నుంచి 5.44 గంటల్లోగా నదీస్నానం చేసి కార్తీక దీపాలు వెలిగించాలి. ఉదయం 7.58 నుంచి 9 గంటల వరకు పూజలు చేసుకోవచ్చు. సాయంత్రం 5.15 నుంచి 7.05వరకు దీపారాధనకు అనువైన సమయాలని వేదపండితులు తెలిపారు. ఈ క్రమంలో నగరంలోని గణేష్ ఘాట్ వద్ద కార్తీకమాస లక్ష దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్వర్ణాల చెరువులో సామూహిక కార్తీక దీపోత్సవానికి ఏర్పాట్లు చేశారు.

● పటిష్ఠ ఏర్పాట్లు

కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లావ్యాప్తంగా అన్ని ఆలయాల్లో పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ఆలయాల కార్యనిర్వహణాధికారులు ఇతర శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆలయాలకు వచ్చే భక్తులు అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు. భక్తులను నిర్దేశించబడిన క్యూలైన్లలోనే అనుమతించాలని సూచించారు. క్యూలైన్ల వద్ద దీపాలు వెలిగించే చోట, గుంపులు గుంపులుగా ఉండరాదని పేర్కొన్నారు. ఏదైనా ఆకస్మిక ప్రమాద పరిస్థితులు కనిపించిన వెంటనే దేవదాయ శాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు. అలాగే పోలీసు, విద్యుత్, మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థల అధికారుల సహకారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేశామని తెలిపారు.

విభేదాలు ఎందుకున్నాయ్!

(5వ పేజీ తరువాయి)

చర్చించారు. ఈ విషయాలన్నిటిపైనా నివేదిక సిద్ధం చేసి, త్వరలో జనసేనాని పవన్ కల్యాణ్‌కు అందించనున్నారు. కాగా, మంగళవారం ఎంఎస్‌ఎంఈ చైర్మన్ శివశంకర్‌కు జనసేన పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. పార్టీ జిల్లా నేత నూనె మల్లికార్జున యాదవ్ గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రాము, మురళి, తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై హత్యాయత్నం

నెల్లూరురూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములుముడిలో మంగళవారం ఓ యువకుడిపై హత్యాయత్నం జరిగింది. నెల్లూరురూరల్ సీఐ గుంజి వేణు తెలిపిన వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన కుండా ప్రేమ్‌కుమార్ తన సమీప బంధువైన నగరంలోని బీవీనగర్ నక్కలగుంటకు చెందిన బచ్చు అనిల్‌కుమార్‌కు సోమవారం రాత్రి ఫోన్ చేసి సుమంత్ అనే వ్యక్తి ఫోన్ నెంబరు అడిగాడు. ఈ క్రమంలో ఫోన్‌లోనే మాటమాటా పెరిగి వాగ్వివాదానికి దారితీసింది. మంగళవారం ఉదయం నక్కలగుంట నుంచి ములుముడికి వచ్చిన అనిల్‌కుమార్ తనను ఎందుకు తిట్టావని ప్రేమ్‌కుమార్‌ను ప్రశ్నించడంతో మరోసారి ఇరువురి మధ్య వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రేమ్‌కుమార్ పక్కనే ఉన్న చాకుతో అనిల్‌కుమార్‌పై దాడి చేయడంతో రెండు చోట్ల రక్త గాయాలయ్యాయి. బంధువులు అతడిని హుటాహుటిన నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రాణం తీసిన ప్రేమ!

● మనస్తాపంతో బాలుడి ఆత్మహత్య



రోహిత్ మృతదేహం

నెల్లూరు(క్రైం), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రేమ వ్యవ హారంలో బాలుడు ఆత్మహ త్య చేసుకున్న ఘటన నగ రంలోని వెంకటేశ్వర పురంలో జరిగింది. పోలీసుల సమా చారం మేరకు.. వెంకటేశ్వరపు రం ఇస్లాంపేటలో ఎం వెంకయ్య, సుజాత దంపతులు నివాసం ఉంటు న్నారు. వారికి ఇద్దరు పిల్లలు సంతానం. కుమారుడు మోసా రోహిత్ (17), కుమార్తె ఉంది. రోహిత్ 8వ తరగతి వరకు చదువు కొని ప్రస్తుతం కూలి పనులు చేసుకుంటున్నాడు. అతను సమీప ప్రాంతానికి చెందిన ఓ బాలికను ప్రేమించాడు. ఆ విషయం బాలిక ఇంట్లో తెలియడంతో బాలుడు తల్లిదండ్రులకు తెలియజేశారు. దీంతో రోహిత్‌ను తల్లిదండ్రులు మందలించడంతో అప్పటినుంచి బాలిక జోలికి వెళ్లలేదు. ఈ నెల 3వ తేదీ రాత్రి పూటుగా మద్యం సేవించిన రోహిత్ బాలిక ఇంటి వద్దకు వెళ్లాడు. గమనించిన బాలిక కుటుంబ సభ్యులు బాలుడును నవాబుపేట పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. విషయం తెలుసుకున్న బాలుడు తండ్రి బంధువులతో కలిసి స్టేషన్‌కు వెళ్లి పూచికత్తుపై ఇంటికి తీసుకువచ్చారు. దీంతో మనస్తాపానికి గురైన రోహిత్ మంగళవారం తెల్లవారు జామున తన ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే రోహిత్‌ను కిందకు దించి చికిత్స నిమిత్తం నగరంలోని ఓ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడు తండ్రి వెంకయ్య ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపార్ట్‌మెంట్‌పై నుంచి పడి యువకుడి మృతి

నెల్లూరురూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : అపార్ట్‌మెంట్ రెండవ అంతస్తు నుంచి కిందపడి ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయిన ఘటన కొత్తకాలువ సెంటరులో జరిగింది. నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు రూరల్ కొత్తకాలువ సెంటరులో శ్రీ సూర్య గ్రాండ్ అపార్టుమెంట్ రెండవ అంతస్తు 202వ నెంబరు ప్లాటులో నివాసం ఉంటున్న కటకం గోపీ కృష్ణ(31) సోమవారం ఇంటి బాల్కనీలో నుంచి ప్రమాదవ శాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. భార్య భవానీ నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	128
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 575

దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళలు, ట్రాన్స్ జెండర్స్‌కు కల్పించిన విధంగా దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా కోరారు. మంగళవారం నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు కేటాయించిన సీట్లలో వారినే కూర్చునేలా చర్యలు చేపట్టాలని కోరారు. స్పందించిన సురేష్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి దివ్యాంగుల సమస్యలు తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఐ పార్టీ వైస్ ప్రెసిడెంట్ దుంపల సుబ్బారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి నంబూరు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పెన్నా కరకట్టల పటిష్టతకు మోక్షం!

- ఆధునీకరించి ఎత్తు పెంచుతున్న అధికారులు
- 50 ఏళ్ల తరువాత తొలిసారి మరమ్మతులు
- నగరంలోకి వరద ప్రవాహానికి కళ్లెం



కరకట్టను చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

నెల్లూరురూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు రెండు కాదు గడిచిన యాభైఏళ్ల లోపు పెన్నా కరకట్టలను ఆధునీకరించిన దాఖలాలు లేవు. ఎట్టకేలకు కూటమి పార్టీల ప్రభుత్వంలో ఇందుకు పునాది పడింది. పెన్నాకు వరద వచ్చిన ప్రతీసారి నగరంలోకి ప్రవాహంగా నీరు వచ్చి నివాసాల్లోకి చేరుతోంది. ఇక నుంచి ఈ దూకుడుకు కళ్లెం వేస్తూ పొట్టేపాళెం కలుజు నుంచి పుల్లీడు వాగు వరకు సుమారు 4 కి.మీ మేరకు పెన్నా కరకట్టలను ఆధునీకరించి ఎత్తు పెంచుకుంటూ వస్తున్నారు. ఈ పనులు గత కొన్ని రోజులుగా జోరుగా సాగుతున్నాయి. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి చొరవ తీసుకుని ప్రభుత్వం దృష్టికి వరద ప్రవాహ ఇబ్బందులను తెలియచేయడంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఈ పనులు చేపట్టారు. ఇప్పటి వరకు పెన్నా పొర్లుకట్టలను ఆధునీకరస్తామని, పటిష్టత పెంచుతామని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు చెప్పడమే తప్ప ఆచరణకు నోచుకోలేదు. రాష్ట్రంలో కూటమి పార్టీల ప్రభుత్వం ఏర్పడ్డాక ఇది కార్యరూపం దాల్చింది. నెల్లూరురూరల్ నియోజకవర్గ పరిధిలో సుమారుగా 4 కి.మీ మేర పెన్నా నదికి చెందిన కరకట్టలను ఆధునీకరిస్తున్నారు. 3 అడుగుల ఎత్తు పెంచి మొత్తంగా 15 అడుగుల ఎత్తుకు కట్టలను పటిష్టం చేస్తున్నారు. పెన్నాకు సోమశిల నుంచి వరద ఉధృతి పెరిగినప్పుడల్లా పొట్టేపాళెం వద్ద కట్టల బలహీనతతో పుల్లీడువాగు ద్వారా నగరంలోని నీటి ప్రవాహం చేరేంది. దీంతో మనమసుద్దీన్‌నగర్, పరమేశ్వరినగర్‌లతో పాటు సమీప ప్రాంతాలు నీట మునిగేవి. ఇక ఆ పరిస్థితికి కళ్లెం వేస్తూ తాజాగా కరకట్టల ఆధునీకరణ జరుగుతోంది. పెన్నా నదిలో ఇసుక తవ్వేస్తున్న ట్రాక్టర్ల నిర్వాహకులు ఈ ప్రాంతంలో 17 చోట్ల కరకట్టలను ధ్వంసం చేశారు. దీంతో పొర్లుకట్టలు సహజత్వాన్ని కోల్పోయాయి. పెన్నాకు వరద వచ్చిన ప్రతీ సారి నగరంలోని పలు ప్రాంతాలు నీటమునడం ఆనవాయితీగా మారింది. తాజాగా జరుగుతున్న ఆధునీకరణ పనులతో ఇక నగర శివారు వరద ముంపునకు గురవదని ఇరిగేషన్ అధికారులు చెప్తున్నారు. అలాగే కరకట్టల ఆధునీకరణతో ముంపు వాసులకు భయాందోళనలు తొలగగా, అక్రమ ఇసుక రవాణాకు కళ్లెం పడింది. రానున్న రెండు నెలల్లో వర్షాలు, వరదలు వచ్చే అవకాశాలుండటంతో ఈ ఆధునీకరణ పనులు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.



ఆధునీకరించిన పెన్నా కరకట్ట

ట్రాఫిక్‌ను నియంత్రించండి

- బార్ అసోసియేషన్ అధ్యక్షుడి విజ్ఞప్తి

నెల్లూరు(లీగల్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలో అత్యంత రద్దీగా మారిన ట్రాఫిక్‌ను నియంత్రించాలని నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులిమి అయ్యప్పరెడ్డి మంగళవారం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కోర్టులో బార్ అసోసియేషన్ తరఫున వినతిపత్రం సమర్పించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు సిటీలో ఆటోలు, ప్రైవేట్ బస్సులు, ఇతర వాహనాలు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించకుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయని అందులో పేర్కొన్నారు. దీంతో జీఎన్‌టీ రోడ్డుపై సాధారణ ప్రజలు, ప్రభుత్వ అధికారులు ఆఫీసులకు వెళ్లడానికి ఇబ్బంది కలుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు గమ్య స్థానాలకు చేరుకోవడానికి చాలా ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ట్రాఫిక్‌ను నియంత్రించాలని, పర్మిట్‌లేనటువంటి వాహనాలను, కాలం చెల్లిన వాహనాలను, అడ్డదిడ్డంగా అవుతున్న ఆటోలను నియంత్రించాలని కోరారు. జిల్లా సౌత్ ట్రాఫిక్ పోలీసులు, ఆర్డీవోను పిలిపించి విచారించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. అలాగే రోడ్లలో అడ్డదిడ్డంగా తిరుగుతున్న గోవులను గోశాలకు తరలించాలని కోరారు. దీనిపై తక్షణం స్పందించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ ఈ వినతిపత్రాన్ని ప్రీ లిటిగేషన్ కేసు కింద పరగణించి సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేయాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటి సెక్రటరిని ఆదేశించారు. వెంటనే లీగల్ సర్వీసెస్ అథారిటి సెక్రటరి కె.వాణి సదరు అర్జీని పరిశీలించి రిజిస్టర్ చేసి సౌత్ ట్రాఫిక్ ఈఎస్పీ, ఇన్‌స్పెక్టర్, ఆర్డీవోలకు నోటీసులు జారీ చేశారు. దీనిపై ఆర్డీవో నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లీగల్ సర్వీసెస్ అథారిటీ కోర్టు ముందు హాజరయ్యారు. పోలీసు అధికారులు హాజరు కాకపోవడంతో తదుపరి విచారణ కొరకు ఈ నెల 12వ తేదీకి వాయిదా వేశారు.

రోడ్లను ఆక్రమించి దుకాణాలు పెట్టొద్దు

- ఎన్ఎంసీ కమిషనర్ నందన్



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు ఇబ్బంది కలిగించేలా రోడ్లను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేయవద్దని ఎన్ఎంసీ కమిషనర్ నందన్ సూచించారు. మంగళవారం సుబేదార్‌పేట వద్దనున్న నక్కలజాతుల వారితో ఆయన మాట్లాడారు. రోడ్డును ఆక్రమించి దుకాణాలు ముందుకు వస్తున్నాయని ఆక్షేపించారు. దీనివల్ల అన్ని రకాలుగా ఇబ్బందులు ఏర్పడుతున్నందున వెంటనే తొలగించాలని సిటీప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం ట్రంకురోడ్డు, జగదీష్‌నగర్, బలిజపాళెం, నారాయణ హస్పిటల్ ప్రాంతాలలో పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయకుండా కార్పొరేషన్‌కు చెందిన వాహనాలకే చెత్తను అందించాలన్నారు.

- ఆర్ఐగా చిన్నబాబు

రెవెన్యూ విభాగంలో ఆర్ఐగా చిన్నబాబుకు అవకాశం కల్పిస్తూ కమిషనర్ ఉత్తర్వులిచ్చారు. 3-9 డివిజన్లకు ప్రస్తుతం ఆర్ఐగా ఉన్న శ్రావణ్ కుమార్ వ్యక్తిగత కారణాల దృష్ట్యా ఆ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో అతనని డీసీ చెన్నుడు వద్ద రిపోర్టు చేయాలని ఆదేశించిన కమిషనర్ సదరు డివిజన్లకు ఆర్ఐగా చిన్నబాబును నియమిరచారు. వెంటనే విధుల్లో చేరాలని తన ఆదేశాల్లో పేర్కొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



ఎంఎస్ఎంఈ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నెల్లూరు(జడ్పీ), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నెల్లూరుకు వచ్చిన ఎంఎస్ఎంఈ చైర్మన్ శివశంకర్‌రావును జనశక్తి విద్యుత్ ఎంప్లాయీస్ యూనిన్ నాయకులు కోరారు. ఆయనను మంగళవారం కలిసి ప్రత్యేకం గా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సూర్యప్రకాష్, మల్లికార్జున, కేవతః ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు క్రీడాదుస్తుల పంపిణీ



క్రీడాదుస్తులు అందచేస్తున్న డాక్టర్ రవి

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 4 (ఆంధ్ర జ్యోతి): నగరంలో నిసుంకు చెంగన్న ఉన్నత పాఠశాలలో క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడా కారు లకు డాక్టర్ పోకల రవి ఆర్థిక సహకారంతో మంళవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. అలాగే డివిజన్‌స్థాయిలో లాంగ్ జంప్, హైజంప్‌లలో వరుసగా ఎంపికైన విద్యార్థినులు కే.మేఘన, విజయలక్ష్మి లకు, మండల స్థాయి క్రీడలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అరవింద్, డాక్టర్ పోకల రవి అందచే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు మంచి నైపుణ్యం పెంపొందించుకుని జిల్లాకు మంచిపేరు తీసుకొని రావా లని ఆయన సూచించారు.

నగరంలో పట్టపగలు మృత్యు వాహనాలు



నగరంలో ప్రయాణిస్తున్న కంకర్ లోడు టిప్పర్

నెల్లూరు(క్రైం), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదం దేశ వ్యాప్తంగా సంచలనంగా మారింది. కంకర్ లోడుతో వెళుతున్న టిప్పర్ రోడ్డుపై ఉన్న గుంతలను తప్పించబోయి ఆర్టీసీ బస్సుపై పడటంతో బస్సులోని 19 మంది మృత్యువాత పడ్డారు. ఇంతటి ఘోర రోడ్డు ప్రమాదం తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో కుటుంబాల్లో విషాదచాయలను మిగిల్చింది. ఇదిలా ఉండగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన టిప్పర్ లాంటిదే నెల్లూరు నగర దారుల్లో మంగళవారం మధ్యాహ్నం కంకర లోడ్డుతో ప్రయాణించడం చూసిన ప్రజలు మృత్యువాహనం రోడ్లపై తిరుగుతుందే అని భయపడ్డారు.

లక్ష దీపోత్సవాన్ని విజయవంతం చేయండి

- వీఆర్సీ మైదానంలో ఏర్పాట్లు పరిశీలించిన ఎంపీ వేమిరెడ్డి దంపతులు



వీఆర్సీలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6, 7, 8వ తేదీల్లో నగంలోని వీఆర్సీ మైదానంలో జరిగే కార్తీక మాస లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు కోరారు. ఈ మేరకు మంగళవారం వీఆర్సీ మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఇప్పటి వరకు 80 నుంచి 85 శాతం పనులు పూర్తయ్యాయని, చివరి దశ పనులు మాత్రమే మిగిలాయన్నారు. యాగశాల, మెయిన్‌స్టేజీ, నమూనా ఆలయాల నిర్మాణ పనులు పూర్తయ్యాయని చెప్పారు. 5వ తేదీకల్లా అన్ని పనులు పూర్తి చేసేలా లక్ష దీపోత్సవ కమిటీ సభ్యులు పని చేస్తున్నారని చెప్పారు. కార్తీక మాసంలో వెలిగించే దీపాలు మన జీవితాల్లో చీకట్లను తొలగిస్తాయని, కార్తీక మాసం ఫలాలను ప్రజలందరికీ చేర్చాలన్న ఒక మంచి ఉద్దేశంతో లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. భక్తులు మహాశివుడికి అభిషేకం చేసుకునేలా అన్నీ వసతులు కల్పిస్తున్నామని, ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కోడూరు కమలాకర్ రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, బెజవాడ వంశీరెడ్డి, వీరేంద్రనాయుడు, కార్తీక మాస లక్ష దీపోత్సవ సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్లను సద్వినియోగం చేసుకోండి

- జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు



సమీక్షలో మాట్లాడుతున్న జేసీ వెంకటేశ్వర్లు

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతుబజార్లలో చాలా వరకు దుకాణాలు ఖాళీగా ఉన్నాయని, వీటిని వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో మంగళవారం మార్కెటింగ్, పోలీసులు, తూనికలు కొలతలు, నగరపాలకసంస్థ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని పత్తేఖాన్‌పేట రైతుబజారులో చాలా వరకు దుకాణాలు ఖాళీగా ఉన్నాయని, రోడ్లపై కూర్చొని, తోపుడు బండ్లపై వ్యాపారాలు సాగిస్తున్న వ్యాపారులకు అవగాహన కల్పించి దుకాణాలను అద్దెకు తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలు కూడా తగ్గుతాయని సూచించారు. నవాబుపేట, స్టోన్‌హౌస్‌పేట ప్రాంతాల్లోని వీధి వ్యాపారులకు నవాబుపేటలోని రైతు బజారుకు తరలించడం వల్ల చాలా వరకు ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని, అన్నిశాఖల అధికారులు సమన్వయం చేసుకుని ఆదిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంకా పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత, నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాసులు, పత్తేఖాన్‌పేట రైతు బజారు ఎస్టేట్ అధికారి చందన, నగరపాలకసంస్థ, పోలీసుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి



ఆర్టీసీ బస్టాండులోని స్టాల్స్ యజమానులకు డస్ట్‌బిన్‌లు అందజేస్తున్న సురేష్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశ యం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా నెల్లూరు జోనల్ పరిధిలోని అన్ని ఆర్టీసీ బస్టాండులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి సూచించారు. నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో మంగళవారం ఆర్టీసీలో విధులు నిర్వహించే కాంట్రాక్ట్, హౌస్‌సోర్సింగ్, ఇతర కార్మికులకు రెయిన్ కోట్లు, డిస్పెన్సరీ సిబ్బందికి తెల్లకోట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆర్టీసీ బస్టాండుల్లో ఉన్న దుకాణదారులకు డస్ట్‌బిన్‌లు అందజేశారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండులు చెత్త రహితంగా ఉండేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తున్నామని, అందరి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి షమీమ్, సీటీఎం రమేష్, డిపో మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు ప్రత్యేక థెరపీ



లెర్నింగ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(వైద్యం), నవంబరు 4(ఆంధ్ర జ్యోతి) : మానసిక దివ్యాంగులకు విద్యతో పాటు ప్రత్యేక థెరపీ ద్వారా వారిలో ఎన్నో మార్పులు తీసుకురావచ్చని రెడ్‌క్రాస్ మాగుంట దివ్యాంగుల కేంద్రం కో ఆర్డినేటర్ దాసరి రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. మంగళవారం ఈ కేంద్రంలో మానసిక దివ్యాంగులకు ఎలాంటి శిక్షణ ఇవ్వాలనే దానిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దాసరి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ దివ్యాంగుల కేంద్రంలో ఇలాంటి థెరఫీ చికిత్సలు అందిస్తున్నామని చెప్పారు. మాట్లాడటంలో అస్పష్టత, పూర్తిగా మాటలు రాకపోయినా అలాంటి వారికి స్పీచ్ థెరపీ, నడకలో సమస్యలు ఉన్న పిల్లలకు ఫిజియోథెరపితో సమస్యను పరిష్కరించవచ్చని తెలిపారు. ఇలాంటి సౌకర్యాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం లెర్నింగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల కేంద్రం ప్రిన్సిపాల్ ఉదయ భాస్కర్ తదతరులు పాల్గొన్నారు.

పొదుపు మహిళలు
జీవనోపాధిని పెంపొందించుకోవాలి

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలు జీవనోపాధిని పెంపొందించుకుని ఆర్థికంగా నిలబడాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలపై వర్క్‌షాపు జరిగింది. ఆమె మాట్లాడుతూ ప్రతినెలా ఎఫ్‌పీవోల సమావేశాలు నిర్వహంచాలన్నారు. ఎఫ్‌పీవోలలోని మహిళలు స్వయం సమృద్ధిని సాధించేందుకు అన్నీ చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో డీపీఎం మధుసూదన్, ఏపీఎంలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

అరుదైన పీటీబీడీ శస్త్రచికిత్స విజయవంతం



డాక్టర్ నేరెళ్ల కృష్ణతేజ

నెల్లూరు(వైద్యం), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో మంగళవారం అరుదైన పీటీబీడీ శస్త్ర చికిత్స విజయవంతంగా జరిగిందని ప్రముఖ వాస్క్యులర్ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ నేరెళ్ల కృష్ణతేజ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు నగరానికి చెందిన సుందరం(40) క్యాన్సర్ కారణంగా తీవ్రమైన కామెర్లతో విషమ పరిస్థితిలో మెడికవర్ ఆసుపత్రికి వచ్చారన్నారు. పూర్తిస్థాయి పరిశీలన అనంతరం కాలేయంలోని పిత్తనాళాలు పూర్తిగా మూసుకుపోవటం వల్ల రక్తంలో బిలిరుబిన్ స్థాయిలు ప్రమాదకరంగా పెరిగాయని చెప్పారు. దీంతో అత్యాధునిక పెర్క్యుటేనియస్ ట్రాన్స్ హెపాటిక్ బిలియరీ డ్రైనేజ్ (పీటీబీడీ) పక్రియ శస్త్రచికిత్సను విజయవతంగా నిర్వహించామని తెలిపారు.

సమ్మెకాలానికి జీతం చెల్లించాలి

- మున్సిపల్ కార్మికుల ఆందోళన



ఎన్ఎంసీ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

నెల్లూరు(సిటీ), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాట ప్రకారం సమ్మెకాలం నాటి జీతాన్ని వెంటనే చెల్లించాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేతలు పెంచలనరసయ్య, మనోజ్‌కుమార్ మాట్లాడారు. సమ్మె కాలంలో 14 రోజుల పాటు జీతాలను ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. 60 ఏళ్లు నిండిన కార్మికులకు ఉద్యోగ విరమణతో పాటు ఆర్థిక ప్రయోజనాలను అందించాలని సూచించారు. మరణించిన కార్మికుల కుటుంబాల్లోని వారసులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలన్నారు. మంత్రి, ఎమ్మెల్యే, కమిషనర్ ఈ మేరకు హామీ ఇచ్చి మూడు మాసాలు గడుస్తున్నా అమలు జరగలేదని తెలిపారు. వెంటనే కార్మికులకు ప్రయోజనం చేకూర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కత్తి శ్రీనివాసులు, కొండా ప్రసాద్, సూర్యనారాయణలు పాల్గొన్నారు.

కుమారుడు చిత్రహింసలు పెడుతున్నాడు

- పోలీసులకు తండ్రి ఫిర్యాదు

నెల్లూరు(క్రైం), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కుమారుడు బాగా చూసుకుంటానని నమ్మించి ఇంట్లో నుంచి బయటకు రానివ్వకుండా బంధించి చిత్రహింసలకు గురిచేస్తున్నాడని బాధిత తండ్రి చిన్న బజారు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని ఖుద్దూస్ నగర్‌లో సయ్యద్ అబ్దుల్ నివాసం ఉంటున్నారు. ఆయన కోవూరు థర్మల్ స్టేషన్‌లో మెకానిక్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. ఆయనకు ఇద్దరు భార్యలు కాగా ఇద్దరు కుమార్తెలు, ఆరుగురు కుమారులు సంతానం. 6వ కుమారుడు సయ్యద్ అబ్దుల్ హసిఫ్ తండ్రిని బాగా చూసుకుంటా నని నమ్మించి తండ్రి వద్ద బండి తాళం, ఏటీఎం కార్డులు, పెంక్షన్ ఫైలు, అకౌంట్ బుక్‌లు, ఇంటితాళం, సెల్‌ఫోను తీసుకున్నాడు. అయితే తండ్రిని బయటకు రానివ్వకుండా ఇంట్లోనే పెట్టి తాళం వేసేవాడు. రెండవ భార్య కుమార్తె వద్దకు కూడా పంపకుండా చిత్రహింసలు పెడుతున్నాడని సయ్యద్ అబ్దుల్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రముఖులు

నెల్లూరు(హరనాథపురం)/(విద్య), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ హిమాన్షుశుక్లాను మంగళవారం ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం.పాండురంగారావులు వేర్వేరుగా కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు.

యూరియా కొరత రానివ్వద్దు : కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రబీ వ్యవసాయ సీజన్ మొదలైనందున రైతులకు యూరియా కొరత రానివ్వద్దని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సూచించారు. మంగళవారం రూరల్లోని పెద్దచెరుకూరు పీఏసీఎస్ కార్యాలయం వద్ద నెల్లూరు ఏఎంసీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డితో కలిసి యూరియా బస్తాలను, కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు మేరకు రూరల్లో ప్రతీ రైతుకు యూరియా అందచేసేందుకు పక్కా ప్రణాళికతో వెళ్తున్నామన్నారు. ఒక్క రైతు కూడా యూరియా అందలేదన్న ఆవేదనకు గురికాకూడదని స్పష్టం చేశారు. ఇప్పటికే రైతులకు అందచేసిన కార్డుల ప్రకారం యూరియాను కేటాయించాలని సూచించారు. కొందరు ఉద్దేశ్యపూర్వకంగా పనికట్టుకుని యూరియా కొరత ఉందంటూ వదంతులు సృష్టిస్తున్నారని తెలిపారు. వాటిని రైతులెవ్వరు నమ్మవద్దని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అజయ్ కుమార్‌రెడ్డి, నాయకులు శేషారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీకుమార్‌రెడ్డి, సాబీర్‌ఖాన్‌లు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

16వ డివిజన్‌లో సమస్యలు పరిష్కరించండి

నెల్లూరు(వైద్యం), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని 16వ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డివిజన్‌కు వచ్చిన మున్సిపల్ కమిషనర్ నందన్‌కు మంగళవారం స్థానిక నేతలు వినతిపత్రం సమర్పించారు. డివిజన్‌లోని 4,5,6,7 వీధుల్లో సైడు కాలువలు లేవని, అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న వారికి డ్రైనేజీ సౌకర్యాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం నాయకులు కాయం శ్రీనివాసులు తెలిపారు. దీనివల్ల దోమల కూడా ప్రబలి స్థానికులు అల్లాడిపోతున్నారన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి సంతకాలు సేకరించామని, ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవి, చౌదరి, సుధాకర్, రాజేష్, హర్ష, వెంకి తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరురూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : తన భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని మాదరాజుగూడూరు పల్లెపాళెంకు చెందిన దండు శ్రీవల్లి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ గుంజి వేణు మంగళవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఆమె భర్త నరేంద్ర మద్యాని కి బానిసై అదనపు కట్నం కావాలని మాన సింకంగా, శారీరకంగా భార్యను వేధింపులకు గురిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు జరుగుతుందన్నారు.

16న శివకేశవుల కల్యాణం

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి ఆధ్వర్యంలో ఈనెల 16న అష్టలక్ష్మీ ఆలయంలో శివకేశవుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు గుడ్లదొన వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కార్తీక మాస 12వ మహా రుద్రాభిషేకం, బ్రాహ్మణ వన సమారాధనలు జరుగుతాయని తెలిపారు. వీటితో పాటు 108 మంది బ్రాహ్మణ దంపతులచే సామూహిక షష్టిపూర్తి భీమరధ శాంతి పూజలు జరుగుతాయని తెలిపారు. బ్రాహ్మణులు అందరూ తరలిరావాలని కోరారు.

నేత్రదానం

నెల్లూరు(వైద్యం), నవంబరు 4(ఆంధ్రజ్యో తి): నగరంలోని వెంకటేశ్వరపురంకు చెందిన రోహిత్(17) మంగళవారం మృతి చెందాడు. కుటంబ సభ్యులు వెంకయ్య, ఏడుకొండలు, శ్రీనుల అంగీకారంతో ప్రభుత్వ నేత్ర వైద్యశాల టెక్నీషియన్ సునీల్ నేత్రాలను సేకరిం చారు. మృతుడి కుటుంబ సభ్యులకు నేత్రదాన గుర్తింపు పత్రాన్ని అందచేశారు. నేత్ర దానం చేయాల్సిన వారు 9959589321ను సంప్రదించాలని కోరారు.

నేడు లంకాదహన మహోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని పప్పులవీధి ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా లంకా దహన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు భక్త బృందం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమం రాత్రి 7.30 గంటలకు జరుగుతుందని, ఈ సందర్భంగా 1008 ప్రమిదలతో దేవాలయా న్ని విశేషంగా అలంకరించడం జరుగుతుం దని, భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.

- బాలాజీనగర్‌లో...

బాలాజీనగర్‌లోని సీతారామమందిరంలో కార్తీక దీపోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయని దేవస్థానం కమిటీ తెలిపింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా 1008 ప్రమిదలతో మహాశివలింగ సహస్ర నామార్చన జరుగుతుందని పేర్కొన్నారు. సాయంత్రం 5గంటలకు భక్తులు విచ్చేసి సహస్ర లింగేశ్వరస్వామికి అలంకరణ చేసిన ప్రమిదలను వెలిగించాలని భక్తులకు విజ్ఞప్తి చేసింది.

వైభవంగా ప్రాకారోత్సవం



మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల ప్రాకారోత్సవ అలంకారానికి పూజలు చేస్తున్న భక్తులు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో కార్తీక మాసం వేడుకలు 13వ రోజుకి చేరాయి. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అర్చనలు జరిగాయి. భువనేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకారం, పూజలు జరిగాయి. శివనామస్మరణలతో ఆలయం మారుమోగింది. సాయంత్రం పూలంగిసేవ, కార్తీక దీపారాధనలు జరిగాయి. అనంతరం శివపార్వతులకు ప్రాకారోత్సవం ఘనంగా జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను అర్చభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

కనుల పండువగా కాత్యాయనీ వ్రతం



రాజరాజేశ్వరి ఆలయంలో కాత్యాయనీ వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో మంగళవారం కాత్యాయనీ వ్రతం కనుల పండువగా జరిగింది. సౌభాగ్యం, వివాహం. ఆరోగ్యం కోసం నిర్వహించే ఈ వ్రతంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉదయం 10గంటలకు సత్యనారాయణ వ్రతం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు రఘురామమూర్తి తెలిపారు. సాయంత్రం రాజరాజేశ్వరి ఆలయం శిఖరంపైన అఖండ కార్తీక దీపం వెలిగిస్తామని తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు క్రమశిక్షణతో మెలిగి దర్శనం చేసుకోవాలని, ఆలయ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

వర్షాలు ఆగినా... వదలని నీరు !



చౌటపాలెంలో రోడ్డుపై పారుతున్న వర్షపు నీటిలో నడుస్తున్న వ్యక్తి



రోడ్డు పక్కన నిల్వ ఉన్న వర్షపు నీరు



చౌటపాలెంలో ఇళ్లను చుట్టు ముట్టిన వర్షపు నీరు

నెల్లూరు నగరంలోని పొదలకూరు రోడ్డు సమర్ స్టోరేజీ ట్యాంక్ వద్ద చౌటపాలెంలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఇళ్ల ముందు భారీగా నీరు చేరి నిల్వ చేరింది. దీంతో స్థానికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. వారం రోజులుగా వర్షం లేకపోయినా, వర్షపు నీరు మట్టిలో ఇంకకపోవడంతో వీధులు,ఇళ్లు మునిగిపోయాయి.దీంతో దోమలు,విషకీటకాలు, పాముల భయం స్థానికులను వెంటాడుతోంది. ఇకపోతే నీటి నిల్వ వల్ల దుర్వాసన వ్యాపించి, ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన వక్తం చేస్తున్నారు. ఇకనైనా నగర కార్పొరేషన్ అధికారులు, పాలకులు ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, నెల్లూరు



ఉలవపాడు : గుంతలమయంగా తెట్టు-రామాయపట్నం ప్రధాన రహదారి



అల్లూరు : అధ్వానంగా ఉన్న రాజుపాలెం-ఇస్కపల్లి రోడ్డు



లింగసముద్రంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు దుస్థితి



మర్రిపాడు : కంప సముద్రం వెళ్లే రహదారిపై గుంతలు



కందుకూరు : అడుగుకో గుంతతో నరకాన్ని తలపిస్తున్న మాచవరం - పరకొండపాడు రహదారి



ఉదయగిరి : దుత్తలూరు సెంటర్‌లో గుంతలమయంగా జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు



బుచ్చిరెడ్డిపాళెం : చెన్నూరు మార్గం దుస్థితి

గుంత.. విప్పండి కళ్లకు గంత!

జిల్లాలో గుంతల రోడ్లు వాహనదారులను హడలెత్తిస్తున్నాయి. చిన్న చిన్న గుంతలన్నీ ఇటీవల భారీ వర్షాలకు పెద్ద గోతులుగా మారిపోయి, నీటితో నిండిపోయాయి. గ్రామీణ రహదారుల నుంచి జాతీయ రహదారుల వరకూ ఇదే పరిస్థితి. వీటికి ప్యాచ్ వర్కులు చేయకపోవడంతో వాహనదారులతోపాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెల్లూరు-మనుబోలు మధ్య జాతీయ రహదారిపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల మూలంగా గతంలో అనేక చోట్ల రోడ్డు ప్రమాదాలు జరిగాయి. కొన్ని ప్రమాదాల్లో ప్రయాణికులు మరణించిన సందర్భాలు ఉండగా, మరికొన్ని చోట్ల గాయాలపాలయ్యారు. అలాగే, కందుకూరు, ఉలవపాడు, అల్లూరు, ఉదయగిరి, లింగసముద్రం, మర్రిపాడు, ఏఎస్‌పేట తదితర ప్రాంతాల్లోనూ రోడ్లు అధ్వానంగా మారాఇయ. ప్రధాన రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు నిలబడుతుండటంతో ఎక్కడ గుంత తెలియని పరిస్థితి నెలకొంది. ఈ గుంతలను పూడ్చాలని వాహనదారులు వేడుకుంటున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం



అనంతసాగరం : సోమశిల రోడ్డు ఇలా..

లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణకు

డెకాయ్ ఆపరేషన్స్ : కలెక్టర్

నెల్లూరు(వైద్యం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నియంత్రణకు డెకాయ్ ఆపరేషన్స్ నిర్వహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో లింగనిర్ధారణ నిషేధిత చట్టం (పీసీపీఎన్‌డీటీ), ఏఆర్‌టీల పై జిల్లాస్థాయి మల్టీ మెంబర్ అప్రాపెట్ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ శిశువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు అరికట్టేందుకు స్కానింగ్ సెంటర్‌లను ఆకస్మిక తనిఖీలు చేయాలని సూచించారు. ఆయా స్కానింగ్ సెంటర్‌లలో ప్రభుత్వ నిబంధనలు తప్పక సరిగా పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుజాత, డీఐవో ఉమామహేశ్వరి, గైనకాలజిస్ట్ అండాళ్ భాస్కర్, డీఎస్‌పీ రామారావు, డెమో కనకరత్నం, ఎన్జీవో కవితారెడ్డి పాల్గొన్నారు.

డీపీవోకి సీఈవో ఇన్‌చార్జి బాధ్యతలు

నెల్లూరు(జడ్పీ) : జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సీఈవో మోహన్‌రావు ట్రైనింగ్‌కు హాజరవుతున్నందు న సీఈవో ఇన్‌చార్జి బాధ్యతలను డీపీవో శ్రీధర్‌రెడ్డికి అప్పగిస్తూ కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి మోహన్‌రావు పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో విజయవాడలో ఈనెల 6 నుంచి 19వ తేదీ వరకు జరిగే ట్రైనింగ్‌కు హాజరవుతున్నారు.

హైరిస్క్ వ్యాధులను గుర్తించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు(వైద్యం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియన్‌లు హైరిస్క్ వ్యాధులను గుర్తించి తక్షణం వైద్యులు చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత సూచించారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన ఎల్‌టీల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ల్యాబ్‌లలో రక్తపరీక్షలు నిర్వహించి సకాలంలో కచ్చితమైన ఫలితాలు అందచేయాలని సూచించారు. జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని, తద్వారా క్షయవ్యాధి నివారణకు వైద్యులు కృషి చేస్తారని పేర్కొన్నారు. జిల్లా మలేరియా నివారణ అధికారి హంస్వేనమ్మ మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్‌లు అందరూ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. వారాంతపు, మాసాంతపు నివేదికలు తప్పనిసరిగా అందించాలని పేర్కొన్నారు. న్యూక్లియర్ వైద్యాధికారి డాక్టర్ సురేంద్ర మాట్లాడుతూ సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి గురించి తెలియచేసి ఆయా వ్యాధులు నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు మలేరియా నివారణ అధికారి నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

నేడు సామూహిక సత్యనారాయణ వ్రతం

నెల్లూరు(సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉదయం 9గంటలకు సామూహిక సత్యనారాయణ వ్రతం, సాయంత్రం 4గంటలకు సీతారాముల కల్యాణం జరుగుతాయని ఆలయ చైర్మన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సీతారాముల కల్యాణం అనంతరం కృతికా దీపం, సహస్ర దీపాలంకరణ జరుగుతుందన్నారు.

ఇదేమో.. జాతీయ రహదారి...

మాకేమో.. ఇదే అడ్డదారి !



జాతీయరహదారి ఉన్న ఆవులను తరుముతున్న పోలీసులు

మనుబోలు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రం.. ఆవుల సంరక్షణకు సంబంధించింది కాదు. గోమాత యాత్ర అంతకన్నా కాదు. ఇది మనుబోలు జాతీయరహదారి. ఇదిగో.. ఇలా.. ఆవులకు నిత్యం ఇదే అడ్డదారి. ఒకటికాదు... రెండు కాదు. సుమారు పాతిక ఆవులను యజమానులు ఇలా బాధ్యతారహితంగా హైవే పైకి వదిలేస్తున్నారు. రాత్రివరకు జాతీయరహదారిపై తిరగాడుతూ, డివైడర్‌లపై ఆకు, అలములు తింటూ రోడ్డుకు అడ్డంగా మందలు మందలుగా తిరుగుతుంటాయి. గతంలో ఈ ఆవుల మందల వల్ల చాలా ప్రమాదాలు జరిగాయి. పలుమార్లు పోలీసులు ఆవుల యజమానులను హెచ్చరించినా ప్రయోజనం లేకుండా పోతోంది. ఇక రోడ్డుపై భద్రతాధికారులు దృష్టి పెట్టాలి.

బందోబస్తు మధ్య దుకాణాల ఖాళీ

- నిబంధనలు అతిక్రమించి నిర్మాణం చేసిన వైసీపీ నేత
- నాడు చోద్యం చూసిన బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులు
- నష్టపోయిన చిరువ్యాపారులు



బీఎస్‌ఎన్‌ఎల్ కాంప్లెక్స్‌లో గదులు ఖాళీ చేయించేందుకు వచ్చిన పోలీసులు



సీఐతో వాగ్వాదం చేస్తున్న వైసీపీ నేతలు రఫీ, గంగిరెడ్డి

కందుకూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున బీఎస్‌ఎన్‌ఎల్ ఆవరణలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లోని చిరువ్యాపారులను భారీ పోలీసు బందోబస్తుతో మంగళవారం ఖాళీ చేయించారు. బీఎస్‌ఎన్‌ఎల్ అధికారు కోరికతో సీఐ అన్వర్‌బాషా నేతృత్వంలో రూరల్ ఎస్‌ఐ నాయక్, కాంప్లెక్స్‌లోని చిరువ్యాపారులను ఖాళీ చేయించారు. ఈ వ్యవహారంలో బీఎస్‌ఎన్‌ఎల్ అధికారుల బాధ్యతారాహిత్యం.. అధికారపార్టీ నేతల ఒత్తిళ్లకు అనుగుణంగా తీసుకున్న నిర్ణయాల ఫలితంగా చిరువ్యాపారులు వీధినపడ్డారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2022లో అప్పటి వైసీపీ నేతలు ఇష్టారీతిగా వ్యవహరించడంపై ఆంధ్రజ్యోతి సహా పలు పత్రికల్లో కథనాలు వచ్చాయి. అంతేకాక ఆ శాఖ ఉన్నతాధికారులకు లిఖిత పూర్వక ఫిర్యాదులు చేసినా చోద్యం చూస్తూ కూర్చోవటమే కాక వైసీపీ నేతలకు అండదండలు అందించారు. సెట్‌బ్యాక్‌లు కూడా వదలకుండా షాపింగ్‌కాంప్లెక్స్ నిర్మించారు. అయితే ప్రస్తుతం అదే బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులు బీఎస్‌ఎన్‌ఎల్ భవనాన్ని లీజుకు తీసుకున్న వ్యక్తి నిబంధనలు అతిక్రమించాడన్న కారణం చూపించి లీజు రద్దుచేశారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి షాపులు ఖాళీ చేయించారు.

ఈ వ్యవహారంలో వైసీపీ నేతకు ఏమీ నష్టం లేకపోయినా, చిరువ్యాపారులు వీధినపడే దుస్థితి వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారీతిగా జరిగిన వ్యవహారం అయినందునే లీజు రద్దుచేయటం జరిగిందని, బీఎస్‌ఎన్‌ఎల్‌కు ఆదాయం పెంచటమే లక్ష్యం తప్ప ఇందులో కక్షసాధింపులు ఏమీ లేవని టీడీపీ నేతలు పేర్కొన్నారు.

పిల్లలను చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలి

- జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు4(ఆంధ్రజ్యోతి): పిల్లల దత్తతను చట్టబద్ధంగా మాత్రమే తీసుకోవాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి బీసరేష్ పేర్కొన్నారు. మంగళవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో దత్తత మాసోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ నూతన మార్గదర్శకాల ప్రకారం దత్తత పొందటంచాలా శులభతరమన్నారు. చట్టబద్ధంగా కాకుండా మరే ఇతర పద్ధతుల ద్వారా దత్తత తీసుకుంటే అది చట్టరీత్యా నేరమన్నారు. దత్తతకు సంబంధించిన వివరాల కోసం నగరంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నున్న శిశు గృహంలో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, సీహెచ్ సమత, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పటిష్ట భద్రతా చర్యలు

నెల్లూరు(క్రైం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లావ్యాప్తంగా దేవాలయాల్లో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టామని ఎస్పీ అజిత వేజెండ్ల ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సురక్షితంగా, ప్రశాంతంగా పౌర్ణమి పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా పోలీసు శాఖ పటిష్ట భద్రతా చర్యలు చేపట్టిందన్నారు. రద్దీ అధికంగా ఉన్న ప్రదేశాల్లో క్యూలైన్ వ్యవస్థలు, పార్కింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ నియంత్రణ ఇలా అనేక జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. రద్దీగా ఉండే ఆలయాలు, ఘాట్ల వద్ద తోపులాటలు, తొక్కిసలాటలు జరగకుండా క్రమశిక్షణతో క్యూలైన్లలో మాత్రమే ముందుకు సాగాలని ఎస్పీ కోరారు.

- అనుమంతించిన ప్రదేశాల్లోనే స్నానాలు చేయాలి: గోపినాథ్ జెట్టి

కార్తీక పౌర్ణమి సందర్భంగా సందర్శకులు పోలీసుల సూచనలు తప్పక పాటిస్తూ అనుమతించిన ప్రదేశాల్లోనే స్నానాలు చేయాలని కోస్టల్ సెక్యూరిటీ ఇన్‌చార్జ్ అధికారి గోపినాథ్ జెట్టి భక్తులను కోరారు. పౌర్ణమి సందర్భంగా బుధవారం సముద్ర స్నానాలకు వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బీచ్‌ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని కోస్టల్ జిల్లా మెరైన్ అధికారులను గోపినాథ్ జెట్టి ఆదేశించారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటల నుంచే బందోబస్తు విధులు నిర్వహించాలని, స్థానిక పోలీసులు, రెవెన్యు, మత్స్యకార, వైద్యారోగ్యశాఖ, స్వచ్ఛందసంస్థల సమన్వయంతో ప్రమాదాలు జరగకుండా చూడలన్నారు. సందర్శకులు పోలీసుల సూచనలు తప్పక పాటించాలని, పోలీసులు సూచనలు తప్పక పాటించాలన్నారు. సాయంత్రం ఆరు గంటల తర్వాత సముద్రస్నానాలకు అనుమతులు ఉండవని, అత్యవసర సహాయం కోసం 112 లేదా మెరైన్ పోలీసు హెల్ప్‌లైన్ 1093కు ఫోన్ చేయాలని కోరారు.

ఆయిల్ ట్యాంకర్లకు మాఫియా బెడద

నెల్లూరు(సాంస్కృతికం) : కృష్ణపట్నం పోర్టు నుంచి ఆయిల్ సరఫరా చేసే ట్యాంకర్లకు మాఫియా బెడద ఎక్కువగా ఉందని తిరుపతి జిల్లా ఆయిల్ ట్యాంకర్ అసోసియేషన్ అధ్యక్షుడు యోగానంద్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జర్నలిస్టు భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పోర్టులో యూనియన్ ఆఫీసు ఏర్పాటు చేశారని తెలిపారు. ఆ యూనియన్ ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ట్యాంకర్‌కి రూ.300 కర్నాటక, తమిళనాడు ఆయిల్ ట్యాంకర్లకు రూ.700 వసూలు చేస్తున్నారన్నారు. రోజుకి రూ.300 చొప్పున 150 ట్యాంకర్లు ఆంధ్రప్రదేశ్‌వి, కర్నాటక, తమిళనాడు ట్యాంకర్లతో కలిపి ఆ యూనియన్‌కి నెలకి దాదాపు రూ.65 లక్షలు ఆదాయం వస్తోందని తెలిపారు. ట్యాంకర్లు నుంచి వసూలు చేసిన రూ.65లక్షలు ఎక్కడికి వెళ్తున్నాయి అనేది తెలియడంలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినా కృష్ణపట్నంలో మాఫియా అవినీతి పెరగడం పట్ల ఆందోళనగా ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిలు ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని ట్యాంకర్ల యజమానులకు న్యాయం చేయాలని కోరారు.

ఉదయగిరి డిప్యూటీ ఎంపీడీవోగా మోహన్‌రావు

ఉదయగిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి మండల పరిషత్ కార్యాలయ డిప్యూటీ ఎంపీడీవోగా మంగళవారం ఎస్ మోహన్‌రావు బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం రాయవరం గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ఉన్నతాధికారులు డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి కల్పిస్తూ ఇక్కడికి బదిలీ చేయడంతో బాధ్యతలు స్వీకరించారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11572
వెండి కిలో ధర	రూ. 150300
వెండి ఒక గ్రాము	రూ. 156.30

అధిక లోడుతో ఇసుక టిప్పర్లు

● ధ్వంసమవుతున్న రహదారులు ● బెంబేలెత్తుతున్న వాహనదారులు



ఉదయగిరి సమీపంలో 167-బీజీ జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొట్టిన ఇసుక టిప్పర్(ఫైల్)

ఉదయగిరి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో విస్తరించి ఉన్న 167-బీసీ, 167-బీ, 565 జాతీయ రహదారులపై నిత్యం పదుల సంఖ్యలో ఇసుక, కంకర టిప్పర్లు మితిమీరిన వేగంతో దూసుకెళుతున్నాయి. దీంతో రహదారులు ధ్వంసమవడమే కాకుండా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. దీంతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. సంగం, ఆత్మకూరు, జొన్నవాడ ఇతరత్రా ప్రాంతాల్లో ఉన్న ఇసుక రీచ్‌లు, కంకర క్వారీల నుంచి ఇసుక, కంకర పరిమితికి మించి తరలిస్తూ ప్రమాదాలకు గురవుతున్నాయి. ప్రతిరోజు పదుల సంఖ్యలో టిప్పర్లు ప్రకాశం జిల్లా మార్కాపురం, సీఎస్‌పురం, పామూరు, కనిగిరి, పొదిలి తదితర ప్రాంతాలకు ఇసుక, కంకర తరలిస్తున్నారు. ఇటీవల ఉదయగిరి పట్టణ సమీపంలోని 167-బీజీ జాతీయ రహదారిపై మితిమీరిన వేగంతో వస్తూ డివైడర్‌ను కొట్టింది. అధిక బరువుతో టిప్పర్లు రాకపోకలు సాగిస్తుండడంతో రహదారులు దెబ్బతింటున్నాయని, అధికారులు స్పందించి అధిక లోడుతో ఇసుక, కంకర తరలిస్తున్న వాహనాలను అరికట్టి ప్రమాదాలను నివారించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు బహుమతులు



ఆత్మకూరు: విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఆత్మకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ సంబరాలు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలస్థాయిలో విద్యార్థులకు చెకుముకి ప్రతిభా పరీక్ష నిర్వహించారు. మండలంలోని 20 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 60 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల విభాగం నుంచి ఆత్మకూరులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రథమ స్థానం సాధించగా, ప్రైవేట్ పాఠశాలల విభాగం నుంచి నలంద ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు డాక్టర్ బిఎస్‌ఆర్ హాస్పటల్ అధినేత డాక్టర్ షకీలా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు సీహెచ్ అనంతలక్ష్మీ, చలపతి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సంధాని, జేవీవీ నాయకులు బడుగు శ్రీనివాసులు, నజీర్, వంటేరు మల్లికార్జున యుటీఎఫ్ నాయకులు జి శివప్రసాద్, ముజీబ్ పాల్గొన్నారు.

●ఏఎస్ పేట: స్థానిక జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు మంగళవారం మండల స్థాయి చెకుముకి పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో చిరమన జడ్పీ హైస్కూల్ విద్యార్థి కె రిషితేజ ప్రథమ స్థానంలో నిలిచారు. శ్రీకొలను విద్యార్థి ద్వితీయ స్థానం, కావలిఎడవల్లి విద్యార్థి తృతీయ స్థానంలో నిలిచారు. వారికి ఏఎస్‌పేట హెచ్‌ఎం వి రుక్మిణి ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ టీచర్ ఉపాధ్యాయులు ఎస్‌కె జిలానీ బాషా,సిహెచ్ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

●చేజర్ల : మండల కేంద్రమైన చేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో చేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జి పవిత్ర, ఎమ్ నవ్యశ్రీ, సీఎచ్. హెమలత, ప్రయివేటు పాఠశాలల విభాగంలో చేజర్ల లుంబిని విద్యాలయంకు చెందిన యు.హేమతేజ, యస్.వందన. ఎస్‌కే. ఆలీఅజహర్ జిల్లా స్థాయికి ఎంపిక అయినట్లు నిర్వాహకులు తెలియజేశారు.

●అనంతసాగరం: స్థానిక ఉన్నత పాఠశాలలో మంగళవారం జేవివి ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల తరపున రేవూరు ఉన్నత పాఠశాల, ప్రయివేటు తరపున శాంతి నికేతన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎంఈవో 2 ప్రభాకర్‌రెడ్డి, జేవివి నాయకులు వేము పెంచలయ్య, స్థానిక గ్రంథాలయాధికారి నారాయణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●ఉదయగిరి : స్థానిక బీసీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు నూర్జహాన్ అధ్యక్షతన జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పోటీ పరీక్షల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెరగడంతోపాటు సృజనాత్మకతను వెలికి తీయవచ్చన్నారు. అనంతరం ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవీవీ కోఆర్డినేటర్ షేక్ కరీముల్లా హుస్సేన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి : ఆర్డీవో



వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో పావని

సీతారామపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా ఘటిక సిద్దేశ్వరానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని ఆత్మకూరు ఆర్డీవో పావని సూచించారు. సిద్దేశ్వరంలో కార్తీక పౌర్ణమి రోజైన బుధవారం కల్పించే వసతులపై ఘటిక సిద్దేశ్వర ఆలయంలో ఆత్మకూరు ఆర్డీవో పావని అధికారులతో, మండల నాయకులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సిద్దేశ్వరంకు వెళ్లే రహదారికి త్వరగా మరమ్మతులు చేపట్టాలన్నారు. అలాగే బుధవారం భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయాల వద్ద బారికేడ్లు ఏర్పాటుచేసి తొక్కిసలాట జరగకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. భక్తుల కోసం ప్రత్యేకంగా వైద్యశిబిరం, తాగునీటి సౌకర్యం, విఐపిల కోసం ప్రత్యేక దర్శన ఏర్పాట్లపై సంబంధిత అధికార యంత్రాంగానికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి సిఐ వెంకట్రావు, తహసీల్దార్ ఫజిహా, వైద్యాధికారిణి స్వప్నరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ మండల కన్వీనర్ చెన్నకేశవులు, జిల్లా ఎస్సీ సెల్ కార్యనిర్వహక అధికార ప్రతినిధి జాషువా, ముస్లీం మైనార్టీ నాయకుడు షేక్ బాబు, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

ఘటిక సిద్ధేశ్వరం రహదారికి మరమ్మతులు

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సిద్దేశ్వరానికి వెళ్లే రహదారి దెబ్బతినడంతో కార్తీక పౌర్ణమిని దృష్టిలో ఉంచుకొని భక్తులు ఇబ్బంది పడకూడదని ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులు, మాజీ మండల కన్వీనర్ చెన్నకేశవులు, మండల క్లస్టర్ ఇంచార్జ్ వెంగళశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు.

భారత రాజ్యాంగంపై విద్యార్థులకు పోటీలు

ఉదయగిరి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం నియోజకవర్గ స్థాయి భారత రాజ్యాంగ పోటీలను ఎంఈవో-1 టీ వెంకటేశ్వర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షల్లో జలదంకి మండలం బ్రాహ్మణక్రాక విద్యార్థిని సీహెచ్ ధరణి, వింజమూరు ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్ గురువిగ్నేష్, ఉదయగిరి మండలం గండిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని జీ సంజన ప్రతిభ కనబరిచారన్నారు. వీరు అసెంబ్లీ స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీ శ్రీనివాస్, అధ్యాపకులు టీ కిషోర్‌కుమార్, డీవీ రమణ, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జీ.శ్రీనివాసులు వ్యవహరించారు.

మాక్ అసెంబ్లీకి తరుణవాయి విద్యార్థిని ఎంపిక

సంగం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పాల పల్లవి నవంబరు 26వ తేదీన అమరావతిలో జరిగే మాక్ అసెంబ్లీకి ఎంపికయిందని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. మాక్ అసెంబ్లీకి పాఠశాల, మండల, నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీల్లో పాల పల్లవి ప్రతిభ కనబరచడంతో మాక్‌అసెంబ్లీలో ఆత్మకూరు నియోజకవర్గం తరఫున పాల్గొనే అవకాశం దక్కింది. దీంతో విద్యార్థినిని డిప్యూటీ డీఈవో జానకిరామయ్య, ఎంఈవో -2 మల్లయ్య, హెచ్‌ఎం ఉపాధ్యాయులు అభినందించారు.

గిరిజనులకు వివాహ కానుక పథకం

ఆత్మకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు వివాహ కానుక పథకానికి శ్రీకారం చుట్టామని నిత్య అన్నదాత, సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆత్మకూరు గ్రామీణ ప్రాంతాల్లో నివసించు గిరిజన వధువుకు రూ. 10వేల నగదు, వధువరులకు పెండ్లి వస్త్రములు కానుకగా అందజేయడం జరుగుతుందన్నారు. ఆధార్‌కార్డులు, కులధృవీకరణ నకలు పత్రాలు ఆత్మకూరు పట్టణంలోని స్పార్క్ సిటీలో ఉన్న తమ కార్యాలయంలో దరఖాస్తు ఫారములు నింపి, 15 రోజు లు ముందుగా లగ్నపత్రిక గాని, పెండ్లిపత్రిక ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈ చైర్మన్‌ను కలిసిన భాను

సంగం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్‌ఎంఈ చైర్మన్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్‌ను నెల్లూరులో సంగం మండల జనసేన పార్టీ సీనియర్ నాయకులు దాడి భానుకిరణ్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన్ను శాలువతో సత్కరించారు. జిల్లా పర్యటలో భాగంగా ఆయన నెల్లూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని సూచించారు.

ప్రధాన రహదారిపై గుంతలు పూడ్చివేతకు శ్రీకారం



రహదారి మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, టీడీపీ నేతలు

ఆత్మకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలోని ప్రధాన రహదారి గుంతలమయమై అధ్వానంగా తయారైంది. ఆర్టీసీ డిపో వద్ద నుంచి సోమశిల రోడ్డు సెంటర్ వరకు పూర్తిగా దెబ్బతింది. ఈనేపథ్యంలో రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు ప్రధాన రహదారిపై గుంతలు పూడ్చే కార్యక్రమనికి మంగళవారం శ్రీకారం చుట్టారు. మర మ్మతు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, టీడీపీ నేతలు తుమ్మల చంద్రారెడ్డి, కేతా విజయభాస్కర్‌రెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, తోడేటి వెంకటయ్య తదితరులు పర్యవేక్షించారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ




ఆత్మకూరు: శిక్షణలో మాట్లాడుతున్న వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ సురేఖదేవి

ఆత్మకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంటల్లో అధిక దిగుబడులకు రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ వి సురేఖదేవి తెలిపారు. స్థానిక ఏఎంసీ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఆత్మకూరు సబ్‌డివిజన్ పరిధిలోని అనంతసాగరం, ఆత్మకూరు, ఏఎస్‌పేట మండ లాల పరిధిలోని ఛాంపియన్ రైతులకు సమగ్ర వ్యవసాయ పద్ధతులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయశాఖ సహకారంతో ఆధు నిక, మేలైన పద్ధతుల్లో పంటలు పండించి ఇతర రైతులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ఎస్ రామ్మోహన్ మాట్లాడుతూ విత్తనశుద్ధి, తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. పశువులు, జీవాలకు వచ్చే వ్యాధులు, అందిస్తున్న టీకాల గురించి పశు వైద్యాధికారి డాక్టర్ ఎం బాలకోటేశ్వరరావు వివరించారు. ప్రస్తుతం ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న సబ్సిడీలను ఉద్యానశాఖాధికారి కె రాజశేఖర్ విపులీకరించారు. కార్యక్రమంలో ఆత్మకూరు, ఏఎస్‌పేట మండలాల వ్యవసాయ అధికారి కె కిషోర్‌బాబు, ఎం సురేష్‌బాబు, డీఆర్‌సీ వ్యవసాయ అధికారి యు గీతా కుమారి, ఆయా మండలాల ఛాంపియన్ రైతులు పాల్గొన్నారు.

●వింజమూరు: మండలంలోని వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవ సాయాధికారి సత్యవాణి పాల్గొని మాట్లా డుతూ రైతులు ఆధునిక పద్ధతులను అవ లంబించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం అధికారి సురేష్‌దేవి, రామ్మోహన్, గీత, వింజమూరు ఏడీఏ ఎం.శేషగిరి, కలిగిరి, కొండాపురం, జలదంకి, వింజమూరు ఏవోలు ఏ.వాసు, ఎస్‌కె.జహీర్, ఎం.శ్రీవాణి, ఎన్.శ్రీహరి, నారాయణ మండల అగ్రికల్చర్ అధికారి, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆశా కార్యకర్తలకు సూచనలిస్తున్న అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

సంగం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీఎం అండ్ హెచ్‌వో ఖాదర్‌వలీ సూచించారు. మంగళవారం ఆయన స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఆశా డే పురస్కరించుకుని ఆశా కార్యకర్తల సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా అంటువ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జగ్రత్తలపై సూచనలు, సలహాలు అందచేశారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అశోక్, వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత జాబితా నుంచి పట్టా భూములు తొలగించాలి



తహసీల్దారు కార్యాలయం వద్ద దర్నా చేస్తున్న రైతులు

మర్రిపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిషేధిత జాబితాలో నుండి పట్టా భూములను తొలగించాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూ సమస్యలపై స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం మూలి వెంగయ్య మీడియాతో మాటాడుతూ చుక్కల భూముల చిక్కులతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, గతంలో మండలంలో ప్రభుత్వం పంపిణీ చేసిన భూమలకు ఇంతవరకు హద్దులు చూపించలేదని విమర్శించారు. ఉన్నతాదికారులు చిన్న, సన్నకారు రైతుల సమస్యలపై దృష్టిపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు డివిజన్ రైతు సంఘం నాయకులు లక్కు ప్రసాద్, మహిళా నాయకులరాలు శ్యామలమ్మ, ప్రమీళ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కార్తీక పౌర్ణమికి శివాలయాల ముస్తాబు

ఉదయగిరి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం వేడుకలు నిర్వహించేందుకు మండలంలో పలు శివాలయాలలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయడంతోపాటు ముస్తాబు చేశారు. పట్టణంలోని పార్వతీ పరమేశ్వరాలయంతో పాటు మండలంలోని గండిపాళెం, ఆర్లపడియ, గుడినరవ, అప్పసముద్రం, యర్రబలిగడ్డ, లింగాలదొనక్షేత్రం ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు, అభిషేకాలు నిర్వహించ నున్నారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

అయ్యప్పస్వామి పంచలోహ విగ్రహం వితరణ



అయ్యప్ప భక్తులతో మన్నేటి వెంకటరెడ్డి

ఉదయగిరి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి అయ్యప్ప సేవా సమాజానికి పంచలోహలతో తయారు చేసిన రెండున్నర అడుగుల అయ్యప్పస్వామి విగ్రహాన్ని మంగళవారం మాజీ ఏఎంసీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

తరుణవాయి పొలాల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

సంగం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరుణవాయిలోని పొలాలను మంగళవారం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో అధికారుల బృందం పరిశీలించింది. గ్రామంలో దువ్వూరు కాలువ ఆయకట్టులో ఉన్న కొన్ని పొలాలను కొందరు రైతులు చేపల గుంటలు ఏర్పాటు చేసేందుకు అధికారుల అనుమతి కోరారు. సమీపంలోని పొలాల రైతులు చేపల గుంటలకు అనుమతి ఇవ్వొద్దని ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం టీడీపీ నాయకుల దృష్టికి పోవడంతో మండల నాయకులు కర్నాటి రవీంద్రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో అధికారుల బృందం పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దారు సోమ్లానాయక్ మాట్లాడుతూ త్వరలో వరి సాగు చేసే రైతులతో గ్రామసభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ, పోలీస్, వ్యవసాయ సాయ, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

రైతులకు యూరియా పంపిణీ



యూరియా బస్తాలు తీసుకెళ్తున్న రైతులు

సంగం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సొసైటీలో రైతులకు మంగళవారం యూరియా పంపిణీ చేశారు. యూరియా కొరత లేకుండా ప్రణాళికాబద్ధంగా రైతులందరికి యూరియా సరఫరా చేసేందుకు వ్యవసాయశాఖ ఇటీవల కార్డు పద్ధతిని ప్రవేశపెట్టింది. ప్రతి రైతుకు ఎకరాకు 3 బస్తాల చొప్పున మొదట విడత విస్తీర్ణాన్ని బట్టి ఎకరాకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేస్తున్నారు. దీంతో రైతులందరికీ యూరియా సరఫరా అవుతుంది.

అదుపు తప్పి మినీ లారీ బోల్తా



బోల్తాపడిన మినీ లారీ

దుత్తలూరు(ఉదయగిరి), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అదుపు తప్పి మినీ లారీ బోల్తాపడిన సంఘటన దుత్తలూరు సెంటర్ సమీపాన వింజమూరు మార్గంలో 167-బీజీ జాతీయ రహదారిపై ప్రభుత్వ వైద్యశాల వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. వరికుంటపాడు మండలం బోయమడగల గ్రామం నుంచి బత్తాయి కాయల లోడుతో మినీ లారీ చెన్నైకు బయలుదేరింది. ఈ తరుణంలో వైద్యశాల సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అహ్మద్‌బాషాకు ఎలాంటి గాయాలు కాలేదు.

శివం.. శంకరం!

● శివకేశవులకు ప్రీతిపాత్రం 'కార్తీక పౌర్ణమి'
● నేడు జిల్లావ్యాప్తంగా వేడుకలు
● ముస్తాబైన ఆలయాలు.. పకడ్బందీగా ఏర్పాట్లు



వీఆర్సీ మైదానంలో కార్తీక పౌర్ణమి ఏర్పాట్లు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : లోక కల్యాణం కోసం మహాశివుడు, శ్రీమన్నారాయణుడు దుష్టసంహారాలు చేసినరోజు కార్తీక పౌర్ణమి. శివకేశవుల కలయికతో కార్తికేయుడి జననం, తారకాసురుడి వధ ఒక ఘట్టం కాగా, తారకాసురుడి ముగ్గురు కుమారులను మహాదేవుడు వధించడం కూడా కార్తీకపౌర్ణమి రోజే జరిగిందని పురాణ కథనం. ఈ రోజున శివాలయాల్లో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహిస్తే కోటిజన్మల పుణ్యఫలం లభిస్తుందని హిందువుల విశ్వాసం. ధ్వజస్తంభం వద్ద నందాదీపం పేరిట దీపం పెట్టడం, నూనె పాత్రలో చంద్రదర్శనం చేసుకోవడం శుభప్రదం. వైష్ణవ ఆలయాల్లో సత్యనారాయణ వ్రతాలు, విశేష అభిషేకాలు, ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా హరిహర మహాదేవ శంభోశంకర.. అంటూ 365 ఒత్తుల దీపం వెలిగిస్తే ఏడాది పొడవునా చేసిన శివపూజకు సమానమైన ఫలితం ఇస్తోంది. కార్తీక పౌర్ణమి నాడు సూర్యోదయానికి ముందే నదులు, చెరువుల్లో స్నానాలు ఆచరించి, శివకేశవులకు రుద్రాభిషేకాలు, రుద్రపూజ, అమ్మవారికి లక్ష కుంకుమార్చన, బిల్వదళార్చన చేస్తారు. మహిళలు రాత్రికి అరటిదొనెల్లో దీపాలు వెలిగించి నదులు, చెరువుల్లో వదులుతారు. ఇదేరోజున కేదారేశ్వర వ్రతాలను కూడా ఆచరిస్తారు. పౌర్ణమి తిథి మంగళవారం రాత్రి 10.30 గంటలకు ప్రారంభమై బుధవారం సాయంత్రం 6.48 గంటల వరకు ఉంటుంది. బుధవారం వేకువజామున 4.52 నుంచి 5.44 గంటల్లోగా నదీస్నానం చేసి కార్తీక దీపాలు వెలిగించాలి. ఉదయం 7.58 నుంచి 9 గంటల వరకు పూజలు చేసుకోవచ్చు. సాయంత్రం 5.15 నుంచి 7.05వరకు దీపారాధనకు అనువైన సమయాలని వేదపండితులు తెలిపారు. ఈ క్రమంలో నగరంలోని గణేష్ ఘాట్ వద్ద కార్తీకమాస లక్ష దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్వర్ణాల చెరువులో సామూహిక కార్తీక దీపోత్సవానికి ఏర్పాట్లు చేశారు.

● పటిష్ట ఏర్పాట్లు

కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లావ్యాప్తంగా అన్ని ఆలయాల్లో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ఆలయాల కార్యనిర్వహణాధికారులు ఇతర శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆలయాలకు వచ్చే భక్తులు అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు. భక్తులను నిర్దేశించబడిన క్యూలైన్లలోనే అనుమతించాలని సూచించారు. క్యూలైన్ల వద్ద దీపాలు వెలిగించే చోట, గుంపులు గుంపులుగా ఉండరాదని పేర్కొన్నారు. ఏదైనా ఆకస్మిక ప్రమాద పరిస్థితులు కనిపించిన వెంటనే దేవదాయ శాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు. అలాగే పోలీసు, విద్యుత్, మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల అధికారుల సహకారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట ఏర్పాట్లు చేశామని తెలిపారు.

విభేదాలు ఎందుకున్నాయ్!

(5వ పేజీ తరువాయి)

చర్చించారు. ఈ విషయాలన్నిటిపైనా నివేదిక సిద్ధం చేసి, త్వరలో జనసేనాని పవన్ కల్యాణ్‌కు అందించనున్నారు. కాగా, మంగళవారం ఎంఎస్‌ఎంఈ చైర్మన్ శివశంకర్‌కు జనసేన పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. పార్టీ జిల్లా నేత నూనె మల్లికార్జున యాదవ్ గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రాము, మురళి, తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై హత్యాయత్నం

నెల్లూరురూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములుముడిలో మంగళవారం ఓ యువకుడిపై హత్యాయత్నం జరిగింది. నెల్లూరురూరల్ సీఐ గుంజి వేణు తెలిపిన వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన కుండా ప్రేమ్‌కుమార్ తన సమీప బంధువైన నగరంలోని బీవీనగర్ నక్కలగుంటకు చెందిన బచ్చు అనిల్‌కుమార్‌కు సోమవారం రాత్రి ఫోన్ చేసి సుమంత్ అనే వ్యక్తి ఫోన్ నెంబరు అడిగాడు. ఈ క్రమంలో ఫోన్‌లోనే మాటమాటా పెరిగి వాగ్వివాదానికి దారితీసింది. మంగళవారం ఉదయం నక్కలగుంట నుంచి ములుముడికి వచ్చిన అనిల్‌కుమార్ తనను ఎందుకు తిట్టావని ప్రేమ్‌కుమార్‌ను ప్రశ్నించడంతో మరోసారి ఇరువురి మధ్య వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రేమ్‌కుమార్ పక్కనే ఉన్న చాకుతో అనిల్‌కుమార్‌పై దాడి చేయడంతో రెండు చోట్ల రక్త గాయాలయ్యాయి. బంధువులు అతడిని హుటాహుటిన నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రాణం తీసిన ప్రేమ!

● మనస్తాపంతో బాలుడి ఆత్మహత్య



రోహిత్ మృతదేహం

నెల్లూరు(క్రైం), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రేమ వ్యవ హారంలో బాలుడు ఆత్మహ త్య చేసుకున్న ఘటన నగ రంలోని వెంకటేశ్వర పురంలో జరిగింది. పోలీసుల సమా చారం మేరకు.. వెంకటేశ్వరపు రం ఇస్లాంపేటలో ఎం వెంకయ్య, సుజాత దంపతులు నివాసం ఉంటు న్నారు. వారికి ఇద్దరు పిల్లలు సంతానం. కుమారుడు మోసా రోహిత్ (17), కుమార్తె ఉంది. రోహిత్ 8వ తరగతి వరకు చదువు కొని ప్రస్తుతం కూలి పనులు చేసుకుంటున్నాడు. అతను సమీప ప్రాంతానికి చెందిన ఓ బాలికను ప్రేమించాడు. ఆ విషయం బాలిక ఇంట్లో తెలియడంతో బాలుడు తల్లిదండ్రులకు తెలియజేశారు. దీంతో రోహిత్‌ను తల్లిదండ్రులు మందలించడంతో అప్పటినుంచి బాలిక జోలికి వెళ్లలేదు. ఈ నెల 3వ తేదీ రాత్రి పూటుగా మద్యం సేవించిన రోహిత్ బాలిక ఇంటి వద్దకు వెళ్లాడు. గమనించిన బాలిక కుటుంబ సభ్యులు బాలుడును నవాబుపేట పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. విషయం తెలుసుకున్న బాలుడు తండ్రి బంధువులతో కలిసి స్టేషన్‌కు వెళ్లి పూచికత్తుపై ఇంటికి తీసుకువచ్చారు. దీంతో మనస్తాపానికి గురైన రోహిత్ మంగళవారం తెల్లవారు జామున తన ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే రోహిత్‌ను కిందకు దించి చికిత్స నిమిత్తం నగరంలోని ఓ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడు తండ్రి వెంకయ్య ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపార్ట్‌మెంట్‌పై నుంచి పడి యువకుడి మృతి

నెల్లూరురూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : అపార్ట్‌మెంట్ రెండవ అంతస్తు నుంచి కిందపడి ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయిన ఘటన కొత్తకాలువ సెంటరులో జరిగింది. నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు రూరల్ కొత్తకాలువ సెంటరులో శ్రీ సూర్య గ్రాండ్ అపార్టుమెంట్ రెండవ అంతస్తు 202వ నెంబరు ప్లాటులో నివాసం ఉంటున్న కటకం గోపీ కృష్ణ(31) సోమవారం ఇంటి బాల్కనీలో నుంచి ప్రమాదవ శాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. భార్య భవానీ నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 575

రహదారులకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రహదారులకు మరమ్మతులు చేయించడానికి అధికారులు సిద్ధమయ్యారు. 'ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా.. ఇంతేనా ?' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామ శివారులోని అల్లూరు- కావలి రహదారిలో పెట్రోల్ బంకు సమీపంలో గుంతలు పడ్డ రహదారిపై కంకర వేసి ఎక్స్‌కవేటర్‌తో చదును చేశారు. వాహన రాకపోకలకు ఇబ్బందులు తొలగడంతో వాహనచోదకులు ఆనందం వ్యక్తం చేశారు.



సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్

ఉలవపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బీ సురేష్ తెలిపారు. మంగళవారం కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో పంచాయతీ అధికారులు, వైద్యఆరోగ్య సిబ్బంది పరస్పర సహకారంతో పారిశుధ్యంపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలకు నీటి నిల్వలు ఉన్నచోట అబేట్, బ్లీచింగ్ చల్లి దోమలు నిర్మూలించాలన్నారు. డయేరియా ప్రబలే అవకాశాలు ఉన్నందున్న తాగునీటి విషయంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకునేలా ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించాలని, గ్రామాల్లో పంచాయతీ ఆధ్వర్యంలో సరఫరా చేసే రక్షిత మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పక పాటించాలి

● ప్రైవేటు బస్సుల యాజమాన్యాలకు ఆర్టీవో మురళీధర్ హెచ్చరిక



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్టీవో మురళీధర్

కావలి రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలను ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు తప్పనిసరిగా పాటించాలని ఆర్టీవో మురళీధర్ పేర్కొన్నారు. కావలి మండలం రుద్రకోటలోని ఆర్టీవో కార్యాలయంలో మంగళవారం ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలను వివరించడంతో పాటు అగ్నిప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఆర్టీవో మాట్లాడుతూ టూరిస్టు, ట్రావెల్స్ బస్సుల్లో ఫైర్ డిటెక్టింగ్ అలారం సిస్టం తప్పనిసరిగా ఉండాలన్నారు. 2019 ఏప్రిల్ తరువాత రిజిస్టర్ అయిన వాహనాలకు అలారం ఇంజన్‌లో అమర్చి ఉంటుందన్నారు. ఇంజన్‌లో మంటలు వ్యాపించినప్పుడు వెంటనే అలారం మోగుతుందని, తద్వారా అగ్నిప్రమాద నియంత్రణ చర్యలు చేపట్టేందుకు వీలుంటుందన్నారు. ఎంవీఐ సుందర్‌రావు మాట్లాడుతూ 2023 అక్టోబరు 1 నుంచి రిజిస్టర్ అయిన వాహనాలకు ఫైర్ డిటెక్షన్ అండ్ సప్రెసింగ్ అలారం సిస్టం తప్పనిసరిగా అన్నారు. దీనివల్ల వాహనం ఇంజన్, క్యాబిన్‌లో మంటలు చెలరేగినప్పుడు వెంటనే అలారం మోగుతుందని, ప్రయాణికుల సీట్ల వద్ద నాజల్స్ ఏర్పాటు చేయడం ద్వారా అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఫాగింగ్ స్ప్రేతో మంటలు ఆర్పవచ్చన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని బస్సులను సీజ్ చేస్తామన్నారు. వాహనాల ఎమర్జెన్సీ డోర్లు లోపల, బయట నుండి కూడా తీసే విధంగా ఉండాలని, వాహనాల్లో ఫస్ట్‌ఎయిడ్ కిట్, ఇండికేటర్ లైట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవీఐ కరుణాకర్, లక్ష్మీబాయ్ ప్రైవేటు బస్సు యాజమానులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవాలి

కావలి (టౌన్) నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జేవీవీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో జేవీవీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన మంగళవారం జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో జేవీవీ చెకుముకి సైన్స్ సంబరాలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా డిప్యూటీ డీఈవో హరిప్రసాద్, జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బీ రవికుమార్‌లు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు. హరిప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో మూఢ నమ్మకాలను పారదోలేందుకు జేవీవీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈవో గోవిందయ్య, ఇన్‌చార్జ్ హెచ్ఎం కోటేశ్వరి, జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు జానకీరామ్, సభ్యులు హరినాథ్, సుబ్బరాయశర్మ, ఎస్ వెంకయ్య, ఖాదర్ బాష తదితరులు పాల్గొన్నారు.



సంబరాలను ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఈవో హరిప్రసాద్

మహిళా జట్టు ప్రపంచ కప్ కైవసంపై కేసీసీ సంబరాలు

కావలి (టౌన్) నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఐసీసీ మహిళా ప్రపంచ కప్‌ను భారత్ సాధించిన సందర్భంగా మంగళవారం మినీ స్టేడియంలోని కేసీసీ నెట్స్ వద్ద బాలికా క్రికెటర్లు కేక్ కట్ చేసుకుని సంబరాలు నిర్వహించుకున్నారు. కేసీసీ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారుల సంబరాలు ఆకట్టుకున్నాయి కేసీసీ క్లబ్ అధ్యక్షుడు సిద్ధు మాట్లాడుతూ మహిళా క్రికెట్ ప్రపంచ కప్‌ను భారత జట్టు సాధించడం దేశానికి గర్వకారణమన్నారు. కేసీసీ ఆధ్వర్యంలో దాదాపు 70 మంది చిన్నారులకు క్రికెట్‌లో శిక్షణ ఇస్తున్నామని, వీరికి ఈ విజయం మరింత ఉత్సాహాన్నిస్తుందన్నారు. కార్యక్రమంలో కేసీసీ సభ్యులు రాంబాబు, రఫీ, సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.

డాక్టర్ ప్రభాకర్‌నాయుడుకి పలువురి పరామర్శ

కావలి (టౌన్) నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైద్యులు, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ప్రభాకర్‌నాయుడును మంగళవారం పలువురు పరామర్శించారు. ప్రభాకర్‌నాయుడు అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స అనంతరం, పట్టణానికి చేరుకోవడంతో పలువురు డాక్టర్లు, ప్రజా సంఘాల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు ఆయనను పరామర్శించారు. శాలువా, పూలమాలలతో సత్కరించారు. స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషా మాట్లాడుతూ ప్రభాకర్‌నాయుడు తన వైద్య సేవలతో ఎందరికో ప్రాణదానం చేశారని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగిరావడం శుభపరిణామమన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలి

బిట్రగుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని అల్లిమడుగు, ఉమామహేశ్వరపురం పంచాయతీల్లో 3 ఫేస్ విద్యుత్‌ను పునరుద్ధరించాలని మండల టీడీపీ నేత సనిగంటి వేణు మంగళవారం అధికారులను కోరారు. తెల్లగుంటలో రెండుగ్రామాల రైతులు నారుమడులు పోసుకునేందుకు సమావేశమయ్యారు. విద్యుత్ శాఖాధికారులు వెంటనే స్పందించి చిన్నకారు రైతులను ఆదుకోవాలని విన్నవించారు.

తీరప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

కావలి రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం మండలంలోని సముద్ర తీరంలో నిర్వహించే పూజలు, సముద్రస్నానాలకు విచ్చేసే భక్తులు అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ జీ రాజేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొంథా తుఫాను ప్రభావంతో ఏర్పడిన వాతావరణ పరిస్థితుల కారణంగా సముద్రం కసురు మీద ఉందని, తుమ్మలపెంట, కొత్తసత్రం, చెన్నాయపాలెం తీరాల్లో మాత్రమే సముద్ర స్నానాలు చేయాలని సీఐ తెలిపారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

లింగసముద్రం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని కేఆర్ జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సూచించారు. మంగళవారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో జేవీవీ ఆధ్వర్యంలో విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలో స్థానిక హైస్కూల్‌కు చెందిన విద్యార్థినుల జట్టు బీవీఎస్ హరిత ఆర్తి, కెని అక్షయ, ఈ రిషితలు మొదటి స్థానం సాధించారు. వీరు ఈనెల 23న జరిగే జిల్లా స్థాయి పరీక్షకు హాజరు కావాలని జెవివి మండల గౌరవ అధ్యక్షుడు ఎం కొండయ్య చెప్పారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు టి శేషారావు, ఎం మాధవరావు, షేక్ మస్తాన్‌వళి, కె ప్రభాకర్, బోసుబాబులు పాల్గొన్నారు.

ఆత్మ నిర్భర్ భారత్.. స్వయం సమృద్ధి భారత్!

బిట్రగుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల బీజేపీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు వీరాల శ్రీనివాసయాదవ్ ఆధ్వర్యంలో 'ఆత్మనిర్భర్ భారత్.. స్వయం సమృద్ధి భారత్' కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గుండ్లపల్లి భరత్‌కుమార్, జిల్లా కార్యవర్గసభ్యుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్ హాజరయ్యారు. అనంతరం బోగోలు తదితర ప్రాంతాల్లో గోడపత్రికలను అంటించి అవగాహన కల్పించారు.

జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్‌లో విద్యార్థుల ప్రతిభ

లింగసముద్రం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత ఆదివారం ఒంగోలులో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలలో మండలంలోని పెదపవనిలోని భోరావు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 బ్యాడ్మింటన్ విభాగంలో 10వ తరగతి చదువుతున్న పులిమి ధనుశ్రీ, కొత్తకోట క్రాంతిసాయి ఉత్తమ ప్రతిభ కనబరిచి తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు టి శ్రీనివాస్, పిడి వెంకట క్రిష్ణలు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎం, పిడి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, పీఎంసీ కమిటీ సభ్యులు, విద్యార్థులు అభినందించారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పెదపవని హెచ్ఎం శ్రీనివాస్, పీడీ వెంకటకృష్ణ

నేటి నుంచి కందుకూరు - సింగరాయకొండ నైట్ సర్వీస్

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): కందుకూరు - సింగరాయకొండల మధ్య గతంలో ఉన్న నైట్ సర్వీస్‌ను బుధవారం నుంచి పునరుద్ధరిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం రావూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. నైట్ సర్వీస్ లేనందున ప్రజల ఇబ్బందుల నేపథ్యంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాలతో నైట్ సర్వీస్‌ను పునరుద్ధరించాలని నిర్ణయించామని తెలిపారు. రాత్రి 9 గంటల నుంచి సింగరాయకొండలో నిలిచే వివిధ రైళ్ల టైమింగ్స్‌కు అనుగుణంగా ఈ సర్వీస్ నడుస్తుందని తెలిపారు.

నేడు గ్రామసభ

వలేటివారిపాలెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలినేనిచెరువు గ్రామ సచివాలయంలో ప్రజాభిప్రాయ సేకరణపై బుధవారం ఉదయం 11 గంటలకు గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శంకర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలినేనిచెరువు గ్రామ పంచాయతీ నుండి విడగొట్టి ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని అర్జీ పెట్టారు. దీంతో పోలినేనిచెరువు పంచాయతీల్లోని నాలుగు గ్రామాల ప్రజల నుండి ప్రజాభిప్రాయ సేకరణకు గ్రామసభ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆ గ్రామ సభకు నాలుగు గ్రామాల ప్రజలు హాజరుకావాలని ఎంపీడీవో శంకర్‌రావు తెలియజేశారు.

పోకూరు రహదారికి మోక్షం

● నిర్మాణానికి రూ.3 కోట్ల మంజూరు



అధ్వానంగా ఉన్న పోకూరు రహదారి

వలేటివారిపాలెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోకూరు రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 3 కోట్ల నిధులు మంజూరు చేసిందని ఆర్అండ్‌బి అధికారులు తెలిపారు. పోకూరు నుంచి శాఖవరం, వీఆర్‌కోట మీదుగా చీమలపెంట వరకూ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయినట్లు తెలిపారు.

బస్సుల్లో ఎమర్జెన్సీ డోర్, ఫైర్ సిలిండర్ తప్పనిసరి



మాట్లాడుతున్న ఆర్టీవో టీవీఎన్ లక్ష్మి, పక్కన ఎంవీఐ అనిల్‌కుమార్ తదితరులు

కందుకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్కూల్, కాలేజీ బస్సులకు ఎమర్జెన్సీ డోర్, ఫైర్ సిలిండర్ తప్పనిసరి అని ఆర్టీవో టీవీఎన్ లక్ష్మి స్పష్టంచేశారు. స్థానిక ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంలో మంగళవారం ఆమె టూరిస్టు బస్సులు, స్కూల్, కాలేజీ బస్సుల యాజమాన్యాలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, బస్సులలో ఇతరత్రా ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. టూరిస్టు బస్సులు, స్కూల్, కాలేజీ బస్సులలో రిజిస్ట్రేషన్ ధ్రువపత్రంలో ఉన్న విధంగానే సీటింగ్ ఉండాలని, అగ్నిప్రమాదాలు సంభవిస్తే తక్షణం మంటలను ఆర్పేలా ఫైర్‌సిలిండర్లు ఉండాలని, ఎమర్జెన్సీ డోర్‌లు తక్షణం తీసుకునేలా ఉండాలని సూచించారు. అలాగే టూరిస్టు బస్సులలో బస్సు బయలుదేరే ముందు అత్యవసర సమయాల్లో ఎమర్జెన్సీ డోర్ తీసుకునే విధానం గురించి, అవసరమైతే అద్దాలు పగులగొట్టేందుకు హేమర్ ఉపయోగించేతీరు గురించి ప్రయాణికులకు అవగాహన కల్పించాలని కోరారు. స్కూల్, కాలేజీ బస్సులకు కూడా తప్పనిసరిగా ఎమర్జెన్సీ డోర్ కలిగి ఉండాలని, అది పనిచేస్తుందా లేదా ప్రతిరోజు చెక్ చేయాలని కోరారు. అలాగే స్కూల్, కాలేజీ బస్సులకు వేగనియంత్రణ పరికరాలు, ఫైర్ డిటెక్టర్ అలారం తప్పకుండా బిగించాలని, ప్రతి బస్సులో డ్రైవర్‌తో పాటు అటెండెంట్ ఉండాలని సూచించారు.తరచూ తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలు పాటించకుంటే కఠినచర్యలు తీసుకుంటామన్నారు.ఈ సమావేశంలో ఎంవీఐ అనిల్‌కుమార్, ఏఓ కె. శివప్రసాద్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా ఉపకరణాల పంపిణీ

కొండాపురం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మి పంచాయతీ పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులకు మంగళవారం కోడె వెంకటరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నగదు, పుస్తకాలు, ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కోడె వెంకటరావు 16 వ వర్ధంతిని పురస్కరించుకొని ట్రస్టు అధ్యక్షుడు చెరుకూరు వెంకటాద్రి ఆధ్వర్యంలో కొమ్మి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. స్థానిక జడ్పీఉన్నత పాఠశాలలో షేక్ ముస్కాన్, సమీర్‌లకు ఆర్థిక సాయంతోపాటు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. రామానుజపురం ఎస్సీకాలనీలో ఇంటర్మీడియేట్ విద్యార్థికి ఫీజు కట్టేందుకు ఆర్థిక సాయం చేశారు. వెంకటాద్రి మాట్లాడుతూ గత 16 ఏళ్లుగా ట్రస్టు ద్వారా కొమ్మి పంచాయతీలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమాలు ఏటా కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాల్యాద్రి, మాధవి, కొమ్మి గ్రామ మాజీ సర్పంచులు చెరుకూరు రమణయ్య, జీయోనా, ట్రస్టు సభ్యులు చెరుకూరు నవీన్, కోడె సింధు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ జీసీ గుమ్మా మాల్యాద్రి, చెరుకూరు శేషయ్య, దేవినేని వెంకటసుబ్బయ్య, బేదపూడి వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ నూతన కార్యవర్గం ఎన్నిక

గుడ్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల జన విజ్ఞాన వేదిక కమిటీని ఆ సంఘ నాయకులు మంగవారం ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. వేదిక డివిజన్ నాయకుడు తానికొండ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల జేవివి అధ్యక్షుడిగా దామా సోమానాయుడు, గౌరవ అధ్యక్షులుగా బత్తల వెంకటేశ్వర్లు, బాసం వెంకటేశ్వర్లు, ఎం.వి శోభారాణి. ఉపాధ్యక్షులుగా సీహెచ్ ఆంజనేయులు, పిల్లి కళగారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా సాలి సత్యనారాయణ, కోశాధికారిగా అద్దంకి అజయ్‌కుమార్, మహిళా కార్యదర్శులుగా శివకుమారి, ప్రసన్నకుమారి, కార్యదర్శులుగా టి. వసంతరావు, ఎస్. భరద్వాజ్, మార్లాటి జనార్ధన్, కన్వీనర్లుగా టి. రవిచంద్ర, తానికొండ పద్మజ, ఎల్. వి నాగమణి, గుర్రం ఆదినారాయణలు ఎన్నికయ్యారు.

చెత్త బుట్టల పంపిణీ

అల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని గాంధీకాలనీ ప్రాంతంలోని మహిళలకు మంగళవారం నగర పంచాయతీ డీడీఓ వరప్రసాద్ స్థానిక టీడీపీ నాయకుడు నజీర్ బాషాతో కలసి చెత్తబుట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదాలపై స్పందించిన ఇందుపూరు

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ఇబ్రహీంపేట, బోగోలు బజారులోని ఆర్‌అండ్‌బీ రోడ్డులో లోతైన గోతుల కారణంగా తరచు ప్రమాదాలు జరుగుతుండటంతో టీడీపీ నేత ఇందుపూరు రామోహన్‌రెడ్డి మంగళవారం స్పందించారు. ట్రాక్టర్లతో కంకరును తెప్పించి ఎక్స్‌కవేటర్‌తో గుంతలు పూడ్చించారు. రహదారి మరమ్మతులకు టీడీపీ నేతలు మాలేపాటి నాగేశ్వరరావు,సుధీర్‌బాబు, బీ ఫిలిప్, ఎస్ భాస్కర్, శ్యామ్ తమవంతు సహకారం అందించారు.

ఎరువుల దుకాణాల ముందు

ధరల పట్టిక ఏర్పాటు చేయాలి

లింగసముద్రం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అమ్మే ఇన్‌పుట్ డీలర్లు తమ దుకాణాల ముందు తప్పనిసరిగా ధరల పట్టిక ఏర్పాటు చేయాలని కందుకూరు ఇన్‌చార్జ్ వ్యవసాయ సహాయ సంచాలకులు కెవి శేషారెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన లింగసముద్రంలోని రైతు సేవా కేంద్రంలో మండలంలోని ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అమ్మే డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దుకాణాలలో రైతులు ఎరువులు ఇతర ఏ వస్తువులు కొనుగోలు చేసినా రైతులకు రసీదులు ఇవ్వాలన్నారు. అలాగే డీలర్లు స్టాక్ రిజిష్టర్లను, ఓ ఫారమ్‌లను, లైసెన్సులను సవరించుకోవాలన్నారు. అలాగే మండల వ్యవసాయ అధికారులు కూడా స్టాక్ రిపోర్టులను తనిఖీ చేయాలన్నారు. ఎవరైనా డీలర్లు నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరిపినా, రైతుల కొనుగోలుకు సంబంధించి బిలుల్లు ఇవ్వకపోయినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే గ్రామ వ్యవసాయ సహాయకులు రబీకి కావలసిన విత్తనాలు, ఎరువులు ఏ విధంగా సన్నద్ధం చేసుకోవాలి, ఈ-పంట నమోదు గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సీహెచ్‌వీఎల్ దుర్గ, సాంకేతిక వ్యవసాయ అధికారి జి మధు మరియు డీలర్లు, వీఏఏలు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు అంతర్జాతీయ గుర్తింపే లక్ష్యం



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, విద్యాశాఖాధికారులు

కందుకూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను గుర్తించి వారికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, విద్యాశాఖల సమన్వయంతో కందుకూరు డివిజన్ స్థాయి అండర్ 14, అండర్ 17 బాలబాలికల క్రీడాపోటీలను స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలల ఆటస్థలంలో మంగళవారం ఎమ్మెల్యే ఇంటూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం, వసతులు కల్పిస్తున్నందున క్రీడాస్ఫూర్తితో గెలుపోటములను సమంగా తీసుకుంటూ తమ సామర్థ్యాన్ని మెరుగుపరుచుకుంటూ విజేతలుగా నిలవాలని నిర్దేశించారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి 250మందికి పైగా క్రీడాకారులు ఈ పోటీలకు హాజరవుతుండగా ఎమ్మెల్యే ఇంటూరి స్వంత నిధులతో వారికి భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు శర్మ, సుబ్బారెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు యు. సుబ్రహ్మణ్యం, హెచ్ఎంలు నరసింహమూర్తి, ద్వారకారాణి, విశ్రాంత పీడీ టి. సుబ్బారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను ఆప్కాస్‌లో చేర్పించాలి

కావలి (టౌన్) నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికులను ఆప్కాస్‌లో చేర్పించాలని సీఐటీయు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రాపూరు సునీల్ మాట్లాడుతూ కావలి మున్సిపాలిటీలో రోజువారీ పారిశుధ్య కార్మికులు 100 మందికి పైగా పనిచేస్తున్నారని, వీరిలో కొంతమంది పదేళ్లు, మరికొంతమంది ఐదేళ్లుగా పని చేస్తున్నారన్నారు. వీరికి రూ.10 వేలకు మించి వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. కనీస వేతన చట్టం అమలు చేసి, కార్మికులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయు పట్టణ అధ్యక్షుడు తిరుపాలు, యూనియన్ నాయకులు జె బాబు, రమేష్, పోలయయ్య, ఒంగోలు రాణి, గద్దె రాగమ్మ సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఆర్ విశ్వోదయలో సాంస్కృతిక పోటీలు

కావలి (టౌన్) నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దొడ్ల రామచంద్రారెడ్డి విశ్వోదయ విద్యా సంస్థల్లో బాలల దినోత్సవ సందర్భంగా సాంస్కృతిక పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జేబీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని ఎంఎం హాలులో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైద్యులు ప్రవీణ్‌కుమార్, రాష్మీ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై సాంస్కృతిక పోటీలను ప్రారంభించారు. చిత్రలేఖనం, సంగీతం, కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్య విభాగాల్లో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీల ఆర్గనైజర్ జ్యోతిశ్రీ, రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, జేబీ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం నాయుడు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ ఆర్ మాల్యాద్రి, పీడీలు ప్రసాద్ రెడ్డి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ జట్లకు క్రీడా దుస్తుల పంపిణీ

కందుకూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లా స్త్రీ, పురుషుల బాస్కెట్‌బాల్ జట్లకు క్రీడాదుస్తులను అసోసియేషన్ చీఫ్ పాటర్న్ నవులూరి మల్లికార్జునరావు బహూకరించారు. మంగళవారం స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాలల క్రీడామైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన రూ. 10వేలు విలువజేసే క్రీడాదుస్తులను జిల్లాజట్లుకు ఎంపికైన క్రీడాకారులను అందజేశారు. ఈనెల 7నుంచి 10 వరకు విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి స్త్రీ, పురుషుల ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్న క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి తొట్టెంపూడి సుబ్బారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ సయ్యద్ జిలానీబాషా తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌కు సత్కారం



మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

కావలి (టౌన్) నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను నేపథ్యంలో సమర్థవంతంగా విధులు నిర్వహించినందుకుగాను సీఎం చంద్రబాబు చేతులమీదుగా అవార్డు అందుకున్న మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌ను మంగళవారం పలువురు ఘనంగా సత్కరించారు. కమిషనర్ కార్యాలయంలో టీడీపీ నాయకులు మేడికొండ సుకుమార్, తలమంచి రవికుమార్, ఎల్లంటి వెంకటేశ్వర్లు, పీసీ రామారావు, జీ ప్రసాద్ పలువురు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు శ్రావణ్‌కుమార్‌ను శాలువా, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తుఫాన్ విపత్తులో కమిషనర్ మానవీయ చైతన్యంతో, బాధ్యతగా విధులు నిర్వహించిన తీరు అభినందనీయమన్నారు. కావలి ప్రజలకు ఎల్లవేళలా ఆయన అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని వారు కొనియాడారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : ఆర్డీవో

కావలి, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో పనిచేసి, ప్రజలకు వేగంగా, పారదర్శకంగా సేవలు అందించాలని కావలి ఆర్డీవో ఎం సన్నీ వంశీకృష్ణ ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం డివిజన్ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రీసర్వే, పీజీఆర్ఎస్, ఇతర రెవెన్యూ అంశాలపై ఆయన సమీక్షించారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలకు తక్షణ పరిష్కారాలు ఎలా చూపాలో తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. అంతకుముందు ఆర్డీవో చాంబర్‌లో నియోజకవర్గంలోని రాజకీయపార్టీలు, ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించి కొత్తగా ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాలపై చర్చించారు. ఆక్వాకల్చర్‌కు సంబంధించి అనుమతుల జారీపై ఆర్డీవో అధ్యక్షతన సబ్‌డివిజనల్ కమిటీ సమావేశం జరిగింది. ఆక్వా కల్చర్‌కు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పర్యావరణం, స్థానిక నీటి వనరుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనుమతుల జారీ ప్రక్రియ పారదర్శకంగా, సమయపాలనతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

సాయి పాదుకలకు ప్రత్యేక పూజలు

అల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి నివాసానికి షిరిడీ సాయినాథుని పాదుకలు చేరుకోవడంతో మంగళవారం సాయంత్రం ఆయన నివాసంలో విశేష పూజలు నిర్వహించారు. పూల పళ్లెంలో పాదుకలను ఉంచి, సాయినాథుని జపం చేశారు. విశేషంగా భక్తులు పాల్గొని పాదుకలను దర్శించుకున్నారు. రిటైర్డ్ ఇరిగేషన్ డీఈ సుబ్రమణ్యేశ్వర రెడ్డి ఈ కార్యక్రమానికి ఆధ్యాత్మిక గురువుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో విష్ణు, శివప్రియ దంపతులతోపాటు, కుటుంబ సభ్యులు చేవూరి సూర్యనారాయణరెడ్డి, సౌజన్య పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విష్ణు అనుచరులు, సాయి భక్తులు పాల్గొన్నారు.

యూరియా వినియోగంపై అవగాహన అవసరం

అల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): యూరియా వినియోగంపై ప్రతీ రైతు అవగాహనతో వ్యవహరించాలని కావలి ఏడీఏ నాగరాజు అన్నారు. అల్లూరు వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆయన రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. యూరియా అవసరానికంటే అధికంగా వినియోగిస్తే వచ్చే నష్టాలను వివరించారు. ప్రతీరైతు యూరియా పంపిణీ కార్డులను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, సచివాయల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు యూరియాపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ నాగరాజు

అతిథులకు స్వాగతం!



సైబీరియా అతిథులు వచ్చేశాయి. నేలపట్టు చెరువుల్లోని పచ్చని కడపచెట్లు తెల్లని కొంగల్ని పూసినట్లుగా కనిపిస్తున్నాయి. ఆకాశంలో ఎగురుతూ, నీళ్లలో ఈదులాడుతూ, ఎండిన పుల్లల్ని ముక్కున కరచుకుని వస్తూ, గూళ్లను అల్లుకుంటూ, పచ్చని గడ్డితో మెత్తని పడకల్ని గూటిలో సిద్ధం చేసుకుంటూ, జత పక్షుల్ని వెతుక్కుంటూ ఎటు చూసినా సందడి కనిపిస్తోంది. బారులు తీరి ఎగిరి వస్తున్న అతిథులతో నేలపట్టు కళకళలాడుతోంది.

→ ఆరు కిలోల చేపల్ని మోయగలదు ఈ సంచి

- 6వ పేజీలో -



ఎక్సైజ్ నిబంధనల ప్రకారం మద్యం షాపులు, బార్లు నిర్వహిస్తాం.

- లైసెన్సులు పొందేటప్పుడు నిర్వాహకులు చెప్పే మాట ఇది. దుకాణం తెరిచాక పలువురు నిబంధనలకు నీళ్లొదులుతున్నారు. వేళలతో నిమిత్తం లేకుండా మద్యం విక్రయిస్తున్నారు. అలాంటి వారిపై నిఘాకు.. చర్యలకు ఎక్సైజ్ శాఖ సిద్ధమవుతోంది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

టైం మించితే 'కిక్కు' దిగుతుంది

జిల్లాలో 32 బార్లకు 28.. 250 మద్యం దుకాణాలకుగాను 248 ప్రారంభమయ్యాయి. ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం మద్యం దుకాణాలు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు.. బార్లు ఉదయం 10 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు తెరచి ఉంచాలి. కానీ, కొందరు నిర్వాహకులు ఆదాయార్జన కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. కొందరైతే ఉదయం 8 గంటలకే బార్లను గుట్టుచప్పుడు కాకుండా బార్లా తెరుస్తున్నారు. ఇక, పలు మద్యం దుకాణాలకు షట్టర్లు వేసినా.. సమీప కూల్ డ్రింక్, బడ్డీ కొట్టుల్లో మద్యం ఉంచి.. ఎనీటైం విక్రయాలు జరుపుతున్నారు. మరికొందరైతే మద్యం షాపుల విషయంలో వేళలు పాటించడం లేదు. వీటిపై ఫిర్యాదులతో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ విషయంలో ఎలాంటి విమర్శలు, ఆరోపణలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. ఇప్పటికే ఉదయం 10 గంటల్లోపు ఎక్సైజ్ సిబ్బంది మద్యం దుకాణాలు, బార్లు తెరవలేదని.. రాత్రి 10 గంటలకు మద్యం షాపులు.. 12 గంటలకు బార్లు మూతపడ్డాయని సూచించేలా సెల్ఫీ ఫొటోలు తీసి జిల్లా అధికారులకు అప్‌లోడ్ చేస్తున్నారు. అయినా, ఫిర్యాదులు వస్తుండటంతో మద్యం షాపులు, బార్లపై మూడెంచల నిఘా ఏర్పాటు చేసింది. ప్రతి చోటా ఎక్సైజ్ సీఐ ఆధ్వర్యంలో ఒకటి.. ఎక్సైజ్ ఈఎస్, ఏఈఎస్ స్థాయిలో రెండోది.. డిప్యూటీ కమిషనరు ఆధ్వర్యంలో మూడోది చొప్పున కమిటీలు ఉంటాయి. ఈ కమిటీల్లో సభ్యులైన ఎన్‌ఫోర్సుమెంటు.. ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు సంయుక్తంగా జిల్లాలో తనిఖీలు చేస్తారు. తిరుపతి జిల్లాలోని కమిటీలు చిత్తూరు జిల్లాలో.. అక్కడి అధికారులను తిరుపతి జిల్లాకు తనిఖీలు చేయిస్తారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కేసు నమోదు చేయడంతో పాటు లైసెన్సు రద్దు చేయాలని కమిషనరుకు సిఫార్సు చేస్తామని ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి స్పష్టం చేశారు.

నత్తనడకన తుడా ఎల్ఆర్ఎస్

- సమన్వయలోపంతో కదలని ఫైళ్లు
- 2674 దరఖాస్తుల్లో 36కే అప్రూవల్

తిరుపతి- ఆంధ్రజ్యోతి

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) పరిధిలో అనధికార లేఅవుట్లు, స్థలాల క్రమబద్ధీకరణకు తీసుకొచ్చిన లేఅవుట్ రెగ్యులరైజ్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) నత్తనడకన సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం గత నెల 23కే ముగియాల్సిన గడువు వచ్చే ఏడాది జనవరి 23వరకు (మూడు నెలలు) పొడిగిస్తూ అవకాశం కల్పించినా.. క్షేత్రస్థాయిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో పురోగతి కనిపించడం లేదు. ఎక్కువ దరఖాస్తులు ప్రాథమిక స్థాయి పరిశీలనలోనే నిలిచిపోతున్నాయి. ఆన్‌లైన్ అప్లికేషన్లు నెలల తరబడి పెండింగ్‌లో ఉండడం, పలుచోట్ల అప్పటికే నగదు చెల్లించినా, బాధితులకు సమాచారం లేకపోవడం వంటి అంశాలు బయటపడుతున్నట్టు తెలుస్తోంది. క్షేత్రస్థాయి సిబ్బంది లోపం, అధికారులతో సమన్వయం లేకపోవడం, శాఖల మధ్య సమాచారం చేరకపోవడం వంటివి ప్రధాన కారణాలుగా తెలుస్తున్నాయి. 2020 లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకంలో 4254 దరఖాస్తులు అందగా.. అందులో 2466 ఆమోదించి ఎల్ఆర్ఎస్ ఇచ్చారు. సవరణలతో కొనసాగింపుగా వచ్చిన ఎల్ఆర్ఎస్-2025 ద్వారా వచ్చినవాటితో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్నవి కలిపి ఇప్పటికే 2674 అప్లికేషన్లు అందాయి. వీటిలో ఇప్పటివరకు కేవలం 36 మాత్రమే అప్రూవల్ అయ్యాయి. ఎల్ఆర్ఎస్ ద్వారా సుమారు రూ.25 కోట్ల ఆదాయాన్ని తుడా లక్ష్యంగా పెట్టుకుంది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల లెక్క చూస్తే ఆ దిశగా పనిచేయనట్లు అర్థమవుతోంది.



ఎల్ఆర్ఎస్ తీసుకుంటే...

ఎల్ఆర్ఎస్ చేసుకోవడం వల్ల స్థలానికి చట్టబద్ధత వస్తుంది. ఇంటి నిర్మాణానికి అనుమతులు సులభంగా వస్తాయి. మౌలిక వసతుల కల్పన బాధ్యత స్థానిక సంస్థ తీసుకుంటుంది. బ్యాంకు రుణాలతో పాటు క్రయ, విక్రయాలకు అడ్డంకులు ఉండవు. స్థల యజమానులు కూడా దీనిపై అవగాహన లేక అవకాశాన్ని చేజార్చుకుంటున్నారనే చెప్పాలి.

ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు : 2674, అప్రూవల్ అయినవి : 36
ఫీజు ఇంటిమేషన్ : 19, షార్ట్ ఫాల్ : 5, పెండింగ్ దరఖాస్తులు : 2614

915 అనధికార లేఅవుట్లు

2025జూన్ 30నాటికి రిజిస్టర్ అయిన అనధికారిక, ఆమోదం లభించని ప్లాట్లను క్రమబద్ధీకరించే లక్ష్యంతో ఎల్ఆర్ఎస్ అమలు చేస్తున్నారు. జిల్లాలో ఏర్పాటైన లేఅవుట్లకు 60 శాతం వరకు అనుమతులు లేవు. 2025 అక్టోబరు నాటికి తుడా పరిధిలో 915 అనధికార లేఅవుట్లు గుర్తింపయ్యాయి.వీటిలో 630గ్రామీణ ప్రాంతాలు, 285 పట్టణ ప్రాంతాల్లో ఉన్నాయి. సుమారు 20వేలకు పైగా ప్లాట్లు ఎల్ఆర్ఎస్ తీసుకునేందుకు అవకాశం ఉంది.

ఎల్లుండి డిప్యూటీ సీఎం రాక



తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రెండు రోజుల ఉమ్మడి జిల్లా పర్యటనకు శుక్రవారం తిరుపతికి రానున్నారు. ఉదయం 10గంటలకు రేణిగుంట మండలం మామండూరు అటవీక్షేత్రాన్ని.. మంగళం వద్దనున్న ఎర్రచందనం గోదామును పరిశీలించి హోటల్ తాజ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 3గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుని ఎర్రచందనం పరిరక్షణ, స్మగ్లింగ్‌ను అరికట్టడం వంటి అంశాలపై పోలీసు, అటవీ, రెడ్ శాండిల్ టాస్క్‌ఫోర్సు అధికారులతో సమీక్షిస్తారు. శనివారం ఉదయం చిత్తూరు జిల్లా పలమనేరుకు చేరుకుని కుంకీ ఏనుగుల సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. ఏనుగుల వల్ల నష్టపోయిన రైతులు, అటవీ శాఖ అధికారులతో సమావేశమవుతారు. అదే రోజు తిరుపతికి చేరుకుని విజయవాడకు తిరుగు ప్రయాణమవుతారని కలెక్టర్ వెంకటేశ్వర్, సీసీఎఫ్ సెల్వం తెలిపారు.

ఢిల్లీ సైన్స్‌టూరుకు ఇద్దరు విద్యార్థినులు



దత్తసాయి చరిష్మ - వర్ణిక శృతిశర్మ

తిరుపతి(విద్య), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈనెల 6 నుంచి 8 వరకు ఇస్రో నిర్వహించనున్న వైజ్ఞానిక పర్యటనకు జిల్లా నుంచి ఇద్దరు టెన్త్ విద్యార్థినులు ఎంపికయ్యారు. సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన, షార్ సెంటర్ పోటీలు, ఇతర రంగాల్లో కనబరిచిన ప్రతిభ ఆధారంగా తిరుపతి ఎస్జీఎస్ పాఠశాలకు చెందిన మేడ దత్త సాయి చరిష్మ, నాయుడుపేట జడ్పీ బాలికల స్కూలుకు చెందిన వర్ణిక శృతిశర్మను ఎంపికచేశారు. అక్కడ నాసా ఇంజనీర్ల ముఖాముఖిలో పాల్గొంటారు. సైన్స్ కార్యకలాపాలు, సదస్సుల్లో భాగస్వాములు కానున్నారు. రష్యన్ సెంటర్ ఆఫ్ సైన్స్‌కల్చర్, నేషనల్ సైన్స్ మ్యూజియం, నెహ్రూ ప్లానిటోరియంలను సందర్శించనున్నారు. వీరిద్దరూ బుధవారం విజయవాడ నుంచి విమానంలో బయలుదేరనున్నారు.

- 'కాశీబుగ్గ' ఎఫెక్ట్

ఆలయాల వద్ద భారీ బందోబస్తు



ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు4(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ తొక్కిసలాట నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం జిల్లాలోని శివాలయాలు, జలపాతాల వద్ద భారీ బందోబస్తును ఎస్పీ సుబ్బరాయుడు ఏర్పాటు చేశారు. శ్రీకాళహస్తి, కపిలతీర్థం, చంద్రగిరి ముక్కోటి, తలకోన, గుడిమల్లం, నారాయణవనం, కైలాసకోన, సదాశివ కోన, సురుటుపల్లి తదితర ప్రాంతాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. ఆ మేరకు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్పీ చెప్పారు. అవసరమైన ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన శివాలయాల వద్ద సీఐ స్థాయి అధికారితో పాటు ఇద్దరు ఎస్ఐలు, ముగ్గురు ఏఎస్ఐలు, 10 మంది సిబ్బందిని నియమించారు. చిన్న, చిన్న శివాలయాలైతే ఎస్ఐ స్థాయి అధికారి, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్ళు, ఐదారు మంది సిబ్బంది బందోబస్తు విధుల్లో ఉంటారు. ప్రతి ఆలయం వద్ద ఎస్టీఎఫ్ పార్టీలు నిఘాలో ఉంటాయి. ఎక్కడైనా ఘటన జరిగేందుకు ఆస్కారం ఉందనుకుంటే స్పెషల్ పార్టీలు అక్కడకు చేరుకునేలా ఏర్పాటు చేశారు. 'నిర్దేశిత క్యూలలో వెళ్లాలి. భద్రతా సిబ్బంది సూచనలు పాటించాలి. రద్దీ ఎక్కువగా ఉంటే దర్శనానికి ఓపికతో వేచి ఉండాలి. వృద్ధులు, మహిళలు, పిల్లలు ముందుగా వెళ్లేలా సహకరించాలి' అంటూ భక్తులకు ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు.

నాన్న వస్తే.. టెర్రస్‌పైకి పంపండి

- హాస్టల్‌పైకి వెళ్లి ఇంజనీరింగ్ విద్యార్థి బలవన్మరణం



సాయి చందు మృతదేహం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): 'మా నాన్నకు ఫోను చేశా. వస్తాడు. వచ్చిన వెంటనే టెర్రస్‌పైకి పంపండి. నేను కొంచెం మాట్లాడాలి' అంటూ సహ విద్యార్థులకు చెప్పాడు. హాస్టల్‌పైకి వెళ్లి బలవన్మరణానికి పాల్పడ్డాడు. బిడ్డతో మాట్లాడదామని వచ్చిన తండ్రికి శవమై ఎదురుగా కనిపించడంతో గుండెలు బాదుకుని విలపించారు. ఈ విషాద ఘటన తిరుపతి- రేణిగుంట రోడ్డులోని ఓ ఇంజనీరింగ్ విద్యా సంస్థలో చోటు చేసుకుంది. తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ తెలిపిన ప్రకారం.. నెల్లూరు నగరం స్టోన్‌హౌస్‌పేటకు చెందిన శ్రీనివాసులు కుమారుడు సాయి చందు(20) తిరుపతి - రేణిగుంట మార్గంలోని కళాశాలలో బీటెక్‌లో చివరి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం రాత్రి తన తండ్రి శ్రీనివాసులుకు ఫోన్ చేసి, 'నిన్ను చూడాలని ఉంది. ఒకసారి రా. అలాగే ఫీజు కట్టాలి' అని చెప్పాడు. ఉదయం వస్తానని తండ్రి చెప్పారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు హాస్టల్‌లో తోటి స్నేహితుల వద్దకు వెళ్లి మరి కొద్దిసేపటిలో తన తండ్రి వస్తారని, టెర్రస్‌పైన తన వద్దకు పంపాలని సాయిచందు చెప్పి వెళ్లాడు. గంట తర్వాత శ్రీనివాసులు హాస్టల్‌కు రాగా.. మిద్దెపైన సాయిచందు ఉన్నాడని ఓ విద్యార్థి తీసుకెళ్లాడు. అక్కడ కిటికీ ఊచకు ఉరేసుకుని, నిర్జీవంగా సాయిచందు కనిపించాడు. అందరూ కేకలు వేసి సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుచానూరు పోలీసులు కేసు నమోదుచేసి, మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. ఓ అమ్మాయి ప్రేమ విషయంలో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ తెలిపారు. ఇంటికి అండగా ఉంటాడనుకున్న సమయంలో ఇలా కొడుకు అర్థంతరంగా తనువు చాలించడంతో శ్రీనివాసులు గుండెలు అవిసేలా విలపించడం అక్కడి వారికి కన్నీరు పెట్టించింది.

చిరుతల కట్టడికి ప్రణాళిక

- త్వరలో వైల్డ్‌లైఫ్ అథారిటీ బృందం తిరుపతికి రాక
- అటవీశాఖ అధికారి సాయిబాబా వెల్లడి



అటవీశాఖాధికారి సాయిబాబా

మంగళం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): 'ఆహారం కోసం శునకాలు, ఇతర ప్రాణుల కోసం చిరుతలు అడవి నుంచి బయటకు వస్తున్నాయి. ఇలా తిరుపతిలోని విశ్వవిద్యాలయాల ఆవరణ.. జీవకోన, మంగళం ప్రాంతాల్లో తిరుగుతున్నాయి. వీటి కట్టడికి శాశ్వత ప్రణాళిక కోసం వైల్డ్‌లైఫ్ అథారిటీతో సంప్రదిస్తున్నాం. త్వరలోనే ఒక బృందం ఈ ప్రాంతాల్లో పర్యటిస్తుంది' అని జిల్లా అటవీశాఖ అధికారి సాయిబాబా చెప్పారు. తిరుపతిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్లు లేని రోజుల్లోనూ చిరుతల కదలికలు ఉండేవని, ఇప్పుడు సోషల్ మీడియా ఉండటంతో ఎక్కువగా వైరల్ అవుతున్నట్లు చెప్పారు. చిరుతలు యూనివర్సిటీ పరిధిలోకి రాకుండా సోలార్ కంచె ఏర్పాటు ప్రతిపాదనను వైల్డ్‌లైఫ్ అథారిటీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. తిరుమల నడక మార్గంలో ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటుపైనా చర్చిస్తామన్నారు. ఎస్వీయూ, వెటర్నరీ వర్సిటీ ప్రాంతాల్లో, అలిపిరి నుంచి జూపార్కు రోడ్డులో ఆహార వ్యర్థాలు పడేయకుండా చూడాలన్నారు. ట్రాప్‌కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో సాయంత్రం 6 నుంచి ఉదయం 6గంటల వరకు ఒంటరిగా తిరగరాదన్నారు. చిరుతలపై అవగాహన కల్పించేలా బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. వీటిపై వైల్డ్ లైఫ్ అథారిటీతో చర్చించాక తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. జిల్లాలో 40వరకు ఏనుగులు మూడు గ్రూపులుగా భాకరాపేట, మామండూరు, పనపాకం ప్రాంతాల్లో సంచరిస్తున్నాయని తెలిపారు. పాపవినాశం, నడకమార్గంలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసుకున్న షాపులపై పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

నా ఇష్టం.. రోడ్డుపైనే ఆపుతా



'ఫుల్లు'గా మందేశాడు. ఆపై వ్యాను నడిపాడు. ఇదే తప్పనుకుంటే, ఆ వ్యానును నడిరోడ్డుమీద నిలిపాడు. వీరంగం చేశాడు. ఇలా శుక్రవారం ఏర్పేడు మండలం జంగాలపల్లి ఐసర్ సమీపాన.. వెంకటగిరి రోడ్డులో అతిగా మద్యం తాగిన డ్రైవరు చర్యతో వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. వీరు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆ వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

- ఏర్పేడు, ఆంధ్రజ్యోతి

మరోసారి మంగళగిరికి సత్యవేడు టీడీపీ పంచాయితీ



ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డితో టీడీపీ నేతలు

సత్యవేడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల పందేరంలో అన్యాయం జరిగిందంటూ.. సత్యవేడు నియోజకవర్గ టీడీపీ పంచాయితీ మళ్లీ మంగళగిరి చేరింది. నేతలు రామాంజులు నాయుడు, ఇళంగోవన్‌రెడ్డి, గోపీనాథరెడ్డి, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, పరమశివం తదితరులు మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయానికి వెళ్లారు. మంత్రి లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు, రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డితో భేటీ అయ్యారు. పార్టీ పరిస్థితులు, పరిణామాలు, నామినేటెడ్ పదవుల భర్తీలో తమకు అన్యాయం జరిగిందని వారు చెప్పినట్లు సమాచారం. సీనియర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు అమలవుతున్నాయని ఆరోపించారని తెలిసింది. గ్రామ, మండల పార్టీ పదవుల ఎంపికలో క్షేత్రస్థాయి నివేదికలు తీసుకోకుండా అనర్హులకు కట్టబెడుతున్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు. గత ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థికి పని చేసిన (చెరకు వర్గం) వారితో పాటు వైసీపీ నుంచి వచ్చిన మరో వర్గం పెత్తనం ఎక్కువై పార్టీకి పని చేస్తున్న నాయకులకు ప్రాధాన్యం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. దీనిపై అధిష్ఠానం ఎలా స్పందిస్తుందో చూడాలి.

శ్రీవారి విరాళంగా వెండి గంగాళం



తిరుమల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి మంగళవారం వెండి గంగాళం విరాళంగా అందింది. హైదరాబాద్‌కు చెందిన జక్కారెడ్డి శ్రీనివాసులురెడ్డి అనే భక్తుడు 22 కేజీల బరువున్న రూ.30 లక్షల విలువైన గంగళాన్ని టీటీడీ అధికారులకు అందజేశారు. అంతకుముందు అదనపు ఈవో వెంకయ్య చౌదరిని ఆయన కలిసి వివరించారు.



తిరుపతి శ్రీకాలేజీ స్థానంలో యూనివర్సిటీ

● తెలంగాణ ఎమ్మెల్యే మల్లారెడ్డి

తిరుమల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శ్రీకాలేజీని కొనుగోలు చేశానని, ఈస్థానంలో యూనివర్సిటీ పెట్టాలనే కోరికతో తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శించుకుని మొక్కుకున్నట్టు తెలంగాణ ఎమ్మెల్యే మల్లారెడ్డి తెలిపారు. తిరుమల శ్రీవారిని మంగళవారం ఉదయం దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశమంతా యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలనే ఆలోచనతో వైజాగ్‌లో ఇప్పటికే యూనివర్సిటీ నెలకొల్పామన్నారు. తిరుపతి శ్రీ ఇంజనీరింగ్ కాలేజీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తయిందని తెలిపారు. మల్లారెడ్డి మాట్లాడుతుండగా కొందరు 'జై తెలంగాణ' అంటూ నినాదాలు చేశారు.

నేడు కార్తీక పున్నమి గరుడసేవ

తిరుమల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బుధవారం గరుడవాహనంపై శ్రీమలయప్పస్వామి దర్శనమివ్వనున్నారు. ప్రతి నెలా పౌర్ణమిరోజున టీటీడీ గరుడసేవను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. బుధవారం కార్తీక పౌర్ణమి కావడం విశేషం. రాత్రి 7 గంటలకు వాహనసేవ ప్రారంభంకానుంది.


సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 15 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.74 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,322

తలనీలాలు సమర్పించినవారు: 26 వేలు



విడిదికి వేళాయె!

వలస పక్షులకు స్వాగతం పలుకుతున్న నేలపట్టు



పెలికాన్‌లు (గూడబాతులు)



గూళ్ళు సర్దుకుంటూ

వైట్ఐబిస్(తెల్లకంకణాయి)



పుల్లలు ఏరుకుంటూ

దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి


వలసపక్షుల విడిది కేంద్రం నేలపట్టులో సందడి మొదలైంది. వేల కిలోమీటర్ల దూరాల నుంచి ఎగురుకుంటూ వస్తున్న పక్షులకు స్వాగతం పలుకుతోంది. అక్టోబరు 20 తర్వాత పక్షుల రాక పలుచగా మొదలైనా వారం నుంచీ వీటి సంఖ్య పెరిగింది. నిజానికి అక్టోబరు మొదటి వారం నుంచే వలసవిహంగాల రాక మొదలు కావాలి. నేలపట్టు చెరువుల్లోని పచ్చని కడప చెట్ల మీద తెల్లని పత్తిపూలలా కొంగలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది వానలు బాగా కురిశాయి. చెరువులు కళకళలాడుతున్నాయి. పులికాట్ సరస్సుకూడా నీటితో నిండుగా ఉంది. దీంతో ఈ యేడాది పెలికాన్ పక్షుల సంఖ్య భారీగా ఉంటుందని అటవీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆస్ట్రేలియా, శ్రీలంక, దక్షిణాఫ్రికా దేశాల నుంచి పెలికాన్ పక్షులు నేలపట్టుకు వస్తాయి. కడప చెట్లపై గూళ్ల అల్లుకుని, జత వెతుక్కుని, గుడ్లు పెట్టి, పొదిగి తమ సంతతి వృద్ధి చేసుకొంటాయి. నేలపట్టు చెరువుల్లోని చెట్లమీద అయిదారు నెలలపాటూ ఉండే పక్షులు, తెల్లవారగానే రెక్కలు విప్పుకుని ఇక్కడికి 10 నాటికల్ మైళ్ళ దూరంలోని పులికాట్ సరస్సులోకి వెళ్లిపోతాయి. ఈ కాలంలో చేపలూ, రొయ్యలూ పులికాట్‌లో సంవృద్ధిగా ఉంటాయి. కడుపు నిండా తిని తమ మెడకింది గూళ్లలో మత్స్యఆహారం దాచుకుని సాయంత్రానికి తిరిగి నేలపట్టుకు చేరుకుని విశ్రమిస్తాయి. ప్రస్తుతం ఎండిన పుల్లలు ఏరుకుంటూ, గూళ్లకు చేరుస్తూ, ఈదులాడుతూ, నింగిలో విన్యాసాలు చేస్తూ జతను ఆకర్షిస్తూ నేలపట్టులో సందడి చేస్తున్నాయి. నీటి అడుగు భాగంలో దొరికే పీచులాంటి గడ్డిని సేకరించి గూళ్లలో మెత్తగా పరచుకుంటున్నాయి. పక్షుల రాక ప్రారంభం కావడంతో స్థానిక వన్యప్రాణి సంరక్షణ శాఖ అధికారులు సందర్శకులను అనుమతిస్తున్నారు.

విడిదికి చేరుకున్న పక్షులు ఇవీ

పక్షి పేరు	2024	2025
	(నవంబర్1 నాటికి)	
పెలికాన్స్ (గూడబాతులు)	921	1026
ఒపన్ బిల్డ్ స్టార్క్స్(నత్తగుల్లకొంగలు)	1547	2384
వైట్ ఐ బీస్(తెల్లకంకణాయి)	1364	1064
లిటిల్ కార్మోరెంట్స్ (చిన్ననీటి కాకులు)	432	622
స్పూన్ బిల్స్ (తెడ్డుమూతి కొంగలు)	02	52
మొత్తం	4266	5148



జతను ఆకర్షించే విన్యాసాలు



పెలికాన్ జంట విహారం



పక్షుల రాక మొదలవడంతో సందర్శనకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే పక్షుల కేంద్రంలోని అన్నీ ర్లోను శుభ్రపరిచే పనులు ప్రారంభించాం. పక్షుల సంఖ్యతో పాటు, సందర్శకుల సంఖ్య కూడ రోజు రోజుకీ పెరుగుతుంది. నేలపట్టు ఆహ్లాదకరమైన ప్రదేశం. ప్రశాంతంగా పక్షుల విన్యాసాలు వీక్షించవచ్చు.

- ఎ. సౌజన్య, నేలపట్టు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్



ఓపెన్ బిల్డ్‌స్టార్క్స్(నత్తగుల్ల కొంగలు)

ప్రేమకలాపాలు



గూళ్లలో విశ్రాంతి



కడప చెట్లుపై కొలువు దీరిన వలస పక్షులు



లిటిల్ కార్మోరెంట్స్(చిన్న నీటి కాకులు)

పంచాయతీనిధుల దుర్వినియోగంపై ఇరువర్గాల ఘర్షణ

● ఇద్దరికి గాయాలు

కేవీబీపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పవనివారికండ్రిగలో పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారంటూ ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాలు... పవనివారికండ్రిగకు చెందిన శ్రీనివాసులు అలియాస్ వాసు గ్రామంలో పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని ఈనెల 3న సోమవారం చర్చించడంపై సర్పంచు వర్గానికి చెందిన చెంచుబాబు మధ్య వాగ్వాదం జరిగింది. మంగళవారం ఉదయం వాసు పెద్దమ్మ బుజ్జమ్మ తన మరిది వెంకటేశ్వర్లును ఎందుకు బెదిరించారంటూ నిలదీశారు. ఈక్రమంలో మునిరామయ్య, చెంచుబాబు, చెంచుకృష్ణ తదితరులు శ్రీనివాసులు చిన్నాన్న సుబ్రహ్మణ్యంపై దాడి చేశారు. శ్రీనివాసయాదవ్ అడ్డుపడగా అతనిపై కూడా కర్రలతోదాడి చేశారు. ఈ దాడుల్లో శ్రీనివాసయాదవ్, చెంచుబాబు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పుత్తూరు డీఎస్పీ రవికుమార్, సీఐ రవీంద్ర, పిచ్చాటూరు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ నరేష్ సిబ్బందితో గ్రామానికి చేరుకుని పరిస్థితిని సర్దుబాటు చేశారు. క్షతగాత్రులను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ముందస్తు చర్యగా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.



శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చెంచుబాబు



శ్రీనివాసయాదవ్

బీజేపీ జెండాతో తిరుమలకు కారు



పార్టీ జెండాతో ఉన్న కారు

తిరుమల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ పార్టీ జెండాతో మంగళవారం ఓ కారు తిరుమలలో కనిపించింది. అలిపిరి తనిఖీలను దాటుకుని బీజేపీ జెండాతో తిరుమలకు చేరుకున్న కారు వరాహస్వామి విశ్రాంతి భవనం వద్ద కనిపించింది.

వైద్యాధికారి తీరుపై విచారణ

వెంకటగిరి, నవంబర్ 4(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ప్రభుత్వాస్పత్రి ఇన్‌చార్జి వైద్యాధికారి జిలానీ బాషా తీరుపై మంగళవారం విచారణ జరిగింది. రోగులకు సరైన వైద్యం అందిచడం లేదని, సహచర వైద్యులు, సిబ్బందిని వేధింపులకు గురిచేస్తున్నారని జిలానీ బాషాపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఇటీవల ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆ సమయంలో వైద్యాధికారి జిలానీ బాషా తీరుపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉన్నతాధికారుల బృందం ఆస్పత్రికి చేరుకొని విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది, జిలానీ బాషా వేధింపుల గురించి అధికారుల బృందానికి వివరించారని సమాచారం. సిబ్బంది చెప్పినవి విషయాలు నమోదు చేసుకోవడంతో పాటు ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించి నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు విచారణాధికారులు తెలిపారు. ఈ విచారణ బృందంలో గూడూరు ఏరియా ఆస్పత్రి సివిల్ సర్జన్ డి.రాజా, పరిపాలనా అధికారి బి.కమల్ కిరణ్, సూళూరుపేట ఏరియా ఆస్పత్రి జూనియర్ అసిస్టెంట్ ఎలికే కరీనా ఉన్నారు.



వైద్యాధికారి జిలానీ బాషాతో మాట్లాడుతున్న విచారణాధికారులు

హైవే, రైల్వే ప్రాజెక్టు భూసేకరణ పనులు వేగవంతం చేయండి

● అధికారులకు కలెక్టర్ ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, వైజాగ్ - చెన్నై కారిడార్ పైపులైను పనులు, పలు భూసంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళిక బద్ధంగా నిర్ణీత గడువు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తిరుపతి కలెక్టరేట్‌లో మంగళవారం తిరుపతి, నెల్లూరు, చెన్నై నేషనల్ హైవే పీడీలు, ఆర్డీవోలు తదితర అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు, వైజాగ్ - చెన్నై కారిడార్ పైపులైను పనులు, రైల్వే ప్రాజెక్టు పనులు, పురోగతిలో ఉన్న పనులపై రేణిగుంట, పూడి, గూడూరు, రేణిగుంట, పాకాల, తిరుపతికి సంబంధించి రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. పెండింగ్ భూసమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీవోలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామ్మోహన్, కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డి, తిరుపతి, నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు విజయభరత్‌రెడ్డి, శివకుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

జిల్లా యంత్రాంగానికి అభినందనలు

మొంథా తుపాన్ సహాయక చర్యల్లో పాల్గొని సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేసిన జిల్లా యంత్రాంగానికి కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. రానున్న రెండు నెలలు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, వ్యవసాయశాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి అర్జీని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ రోజ్మాండ్, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

మరింత సమర్థంగా వ్యర్థాల నిర్వహణ

● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్

తిరుపతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌ను మరింత అభివృద్ధి చేస్తున్నామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. మంగళవారం పద్మావతి అతిథి గృహంలో నగరపాలక సంస్థ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. చెత్త సేకరణ, తరలింపు, ప్రాసెసింగ్ తదితర విషయాలను డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌లు ఆయనకు వివరించారు. అనంతరం పట్టాభిరామ్ మీడియాతో మాటాడుతూ గత ప్రభుత్వం వదిలేసిన కొన్ని వేల టన్నుల చెత్తను శుభ్రం చేస్తున్నామన్నారు. చెత్త శుభ్రం చేసిన ప్రాంతాలను సుందరమైన పార్కులుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఏపీజీబీసీ చైర్మన్ సుగుణమ్మతో కలసి పార్కులు పెంచి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం తెచ్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు. తూకివాకంలోని ఇంటిగ్రెటెడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌ను తమ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. రీసైక్లింగ్ ఫ్యాక్టరీలు కూడా తిరుపతి ప్రాంతాల్లో రానున్నాయని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మునిసిపల్ ఇంజినీర్ తులసికుమార్, డీఈ రమణ, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

21 కిలోల గంజాయి స్వాధీనం ఒడిశాకు చెందిన ఇద్దరి అరెస్టు

పెళ్లకూరు, నవంబరు, 4 (ఆంధ్రజ్యోతి): బేల్దారి పనుల ముసుగులో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఒడిశాకు చెందిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు... పెళ్లకూరు మండలంలోని 71వ జాతీయ రహదారిలో తాళ్వాయిపాడు అండర్ పాస్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని సోమవారం సాయంత్రం ఎస్‌ఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఒడిశా రాష్ట్రం, కలహండి జిల్లా, పండకమాల్ గ్రామానికి చెందిన గోపీనాథ్ బీబార్, మితిన్ బీబార్‌గా తెలిసింది. వారివద్ద నుంచి 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తిరుపతిలో బేల్దారు పనులు చేసుకుంటున్న పండకమాల్ గ్రామానికి బలరాం వద్ద గోపీనాథ్ బీబార్, మితిన్ బీబార్ ఇటీవల పనిలో చేరారు. గంజాయి అక్రమ రవాణా చేసి ఎక్కువ డబ్బు సంపాదించవచ్చని సావీర్ అనే వ్యక్తి వీరికి ఆశ చూపాడని విచారణలో తెలిసింది. నిందితులు ఇద్దరినీ నాయుడుపేట కోర్టులో హాజరుపరచినట్లు సీఐ తెలిపారు.



గంజాయి, నిందితులతో సీఐ సంగమేశ్వరరావు, ఎస్‌ఐ నాగరాజు

శ్రీవారి సేవలో ప్రముఖులు



జస్టిస్ ఈశ్వరయ్య

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య, ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఉన్నారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి



నిమ్మగడ్డ రమేష్‌కుమార్

స్తంభాల గిరీశ్వరుడి ఆలయంలో భక్తులకు మెరుగైన వసతులు



ఈశ్వరయ్య స్వామి ఆలయంలో క్యూలైన్లను పరిశీలిస్తున్న తహసీల్దారు

డక్కిలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురష్కరించుకొని దేవునివెల్లంపల్లిలోని స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయంలో భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురవకుండా మెరుగైన వసతులు కల్పించాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన ఆలయంలో క్యూలైన్లు, ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి సందర్భంగా స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, నిర్దేశించిన క్యూలైన్లలోనే వెళ్లి స్వామివారి దర్శనం చేసుకోవాని సూచించారు. రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో భక్తులు సమన్వయంతో వేచివుండాలన్నారు.

రైతుల పక్షపాతి సీఎం చంద్రబాబు



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ మర్రి ప్రమీల, సహకార సంఘ చైర్మన్ రవీంద్రనాథ్‌రెడ్డి

కోట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు రైతు పక్షపాతి అని వాకాడు వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ మర్రి ప్రమీల, నెల్లూరుపల్లి కొత్తపాళెం సహకార సంఘ చైర్మన్ ఉచ్చూరు రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం సహకార సంఘ కార్యాలయంలో మంగళవారం రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రమీల, రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియాను రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పెన్నక్క చెరువు ఆయకట్టు అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ నారాయణ, దారా సురేష్, సొసైటీ డీఈవో గోపి, ఏవో సుచేంద్రప్రసాద్, భూషణ్ పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు అండగా ప్రభుత్వం



తుఫాన్ బాధితులకు నగదు అందజేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది

చిల్లకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితులకు ఎన్డీఏ ప్రభుత్వం అండగా నిలుస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తిక్కవరం గ్రామంలో మొంథా తుఫాన్ కారణంగా పునరావాస కేంద్రాల్లో ఉన్న కుటుంబాలకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ సమయంలో గ్రామంలోని 75కుటుంబాల వారిని పునరావాస కేంద్రానికి తరలించడం జరిగిందన్నారు. వారికి వారందరికీ రూ.1000 చొప్పున నగదు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచు సతీష్‌రెడ్డి, ఉపసర్పంచు ఆవుల ప్రభాకర్, వీఆర్వో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే వేగవంతం చేయండి

డక్కిలి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో భూముల రీసర్వే పనులను వేగవంతం చేయాలని గూడూరు డివిజనల్ సర్వే అధికారి ప్రసాదరావు అన్నారు. మంగళవారం డక్కిలి తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. మండలంలో ఇంకా రీ సర్వే మొదలు కాని గ్రామాల్లో వెంటనే ప్రారంభించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీటీ ప్రసన్నరాణి, మండల సర్వేయర్ పెంచలయ్య, సచివాలయ సర్వేర్లు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి

గూడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. స్వదేశీ వస్తువుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేలా పార్టీశ్రేణులు ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు దయాకర్, ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు, రవీంద్ర, బాలకృష్ణ, శ్రీనివాసులు, నిరంజన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్‌లో క్వాలిటీ కంట్రోల్ అధికారుల పరిశీలన

వాకాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దిగుంటపాళెం వద్ద లేఅవుట్‌ను క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. 2023లో జగనన్న లేఅవుట్‌లో లెవలింగ్ పనులు చేసినా బిల్లులు కాకపోవడంతో కాంట్రాక్టర్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారులు సురేష్, శ్రీనివాసులు మంగళవారం లేఅవుట్ తనిఖీ చేశారు.

గిరిజనుల సమస్యలపై సమీక్ష

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కోట, వాకాడు, చిల్లకూరు, గూడూరు, డీవీసత్రం మండలాలకు సంబంధించిన గిరిజనుల సమస్యలపై మంగళవారం కలెక్టరేట్‌లో తహసీల్దారు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులతో వర్చువల్ విధానంలో కలెక్టర్ వెంకటేశ్వర్ సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనులకు జీవనోపాధి, తాగునీరు, పక్కా ఇల్లు, ఇంటి స్థలాలు, భూమి సమస్యలు, అటవీహక్కుల కింద ఇచ్చే పట్టాలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, పాఠశాల ప్రహరీ తదితర సమస్యలపై గిరిజనులు ఇచ్చిన అర్జీలను నిశితంగా పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రవినాయుడు, డీఈవో కేవీఎన్‌కుమార్, డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, డీపీవో సుశీలాదేవి తదితర అధికారులు పాల్గొన్నారు.

స్టార్టర్ల చోరీ

పెళ్లకూరు, నవంబరు, 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో నెలబల్లి, బీమవరం గామాల్లో మంగళవారం తెల్లవారుజామున వ్యవసాయ బోరు బావుల వద్ద స్టార్టర్లను దుండగలు అపహరించుకుని వెళ్లారు. రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుమారు 15 స్టార్టర్లు, రాగి వైర్లను దుండగులు అపహరించుకుని వెళ్లారని, నాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్న సమయంలో స్టార్టర్ల చోరీ జరగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలబల్లి, బీమవరం, జీలపాటూరు, చిల్లకూరు, కప్పగుంటకండ్రిగ, చావాలి తదితర గ్రామాల పొలాల్లో తరచూ స్టార్టర్లు, రాగి వైర్లు చోరీకి గురవుతువడడం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు.

వివాదాస్పద భూమి పరిశీలన

సూళ్లూరుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేసియన్‌గుంటలో వివాదాస్పద భూమిని మంగళవారం తహసీల్దార్ గోపినాథ్ రెడ్డి పరిశీలించారు. కేసియన్‌గుంట సర్వే నెంబరు 51-1ఏలో భూమి విషయమై ఇరువర్గాల నడుమ వివాదం తలెత్తడంతో రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. మంగళవారం తహసీల్దార్ సదరు భూమి వద్దకు చేరుకుని ఇరువురి రికార్డులను పరిశీలించారు. సర్వేచేయించి వివాదాన్ని పరిష్కరిస్తామని, అప్పటి వరకు భూమిలోకి ఎవరు ప్రవేశించవద్దని తహసీల్దారు సూచించారు. ఆయన వెంట ఎస్ఐ బ్రహ్మనాయుడు, వీఆర్వో ఉన్నారు.

ఎప్పుడు కూలుతాయో!

శిథిలావస్థలో మంచినీటి ట్యాంకులు



రామాపురం పంచాయతీ ఎస్ఆర్ కండ్రిగ గ్రామంలో శిథిలావస్థలో ఉన్న ట్యాంక్

తడ, నవంబరు, 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో గ్రామీణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని ట్యాంకులు కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. తడ మండలంలో 11, సూళ్లూరుపేటలో 8, దొరవారిసత్రంలో 5, నాయుడుపేటలో 5, పెళ్లకూరు మండలంలో 2 ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని ట్యాంకుల బేస్ పిల్లర్లు సైతం పెచ్చులూడిపోయి ఇనుప ఊచలు బయటపడ్డాయి. శిథిలావస్థలో ఉన్న ట్యాంకుల సామర్థ్యాన్ని నిర్ధారించి ధృవీకరించే బాధ్యతలను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు అప్పగించారు. ఇందుకోసం ఒక్కొక్క ట్యాంకుకు రూ.9వేలు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం ట్యాంకుల సామర్థ్యాన్ని నిర్ధారించేదెప్పుడో తెలియడంలేదు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్‌బీకేఆర్ నివేదిక రాగానే పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



భీములవారిపాళెంలో పెచ్చులూడిపోయిన ట్యాంక్

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి: పాశం



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఏఎరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డివిజన్‌స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే క్రీడాజ్యోతిని వెలిగించి, షాట్‌పుట్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించి ఏకాగ్రతను పెంపొందించుకునేందుకు క్రీడలు దోహదపడుతాయన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు పోటీలను నిర్వహించడంతో పాటు కిట్లు అందజేస్తున్నారన్నారు. విద్యార్థులు గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తితో మెలగాలన్నారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో విద్యార్థులు ప్రతిభచాటి జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో పాటు జాతీయస్థాయిలో రాణించి గూడూరుకు మంచిపేరు తీసుకురావాలన్నారు. స్టేడియంలో జిమ్, ఓపెన్ జిమ్, గ్యాలరీ నిర్మించి క్రీడాకారులకు వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో డీవైఈవో సనత్‌కుమార్, ఎంఈవో కాంచన, నాయకులు బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, చంద్రమౌళి, పీడీలు కరిముల్లా, సుబ్రహ్మణ్యం, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన పెంపొందించేందుకే చెకుముకి పోటీలు



చెకుముకి పోటీల ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న ఎంఈవో కాంచన

గూడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సైన్స్‌పట్ల అవగాహన పెంపొందించేందుకు జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి పోటీలను నిర్వహించడం అభినందనీయమని ఎంఈవో కాంచన అన్నారు. మంగళవారం గూడూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో మండలస్థాయి చెకుముకి సైన్స్ పోటీ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మూఢ నమ్మకాలను పోగొట్టి విద్యార్థుల్లో సైన్స్‌పట్ల అవగాహన పెంపొందించేందుకు జేవీవీ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో జేవీవీ పట్టణ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, బాలకృష్ణంరాజు, నాగరాజు, చెంచునారాయణ, రామ్మోహన్‌రావు, పురుషోత్తమరావు, సుమన్, అరుణ్‌కుమార్, శ్రీనివాసాచారి కల్పన తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి చెకుముకి సైన్సు టాలెంట్ టెస్టు నిర్వహించారు. తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈవో సునీలా చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వీరు ఈనెల 23న తిరుపతిలో జరిగే జిల్లా స్థాయి టాలెంట్ టెస్టుకు హాజరవుతారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, రాష్ట కమిటీ సభ్యుడు చెంగయ్య, సూళ్లూరుపేట మండల అధ్యక్ష, కార్యదర్శులు రాజేష్‌బాబు, రామ్మూర్తి, ఉపాధ్యాయులు ప్రభాకర్, శామ్యూల్, మునస్వామి, భాస్కర్ పాల్గొన్నారు.



ప్రతిభ కబరిచిన విద్యార్థులతో ఎంఈవో సునీల, జేవీవీ నాయకులు

చిన్నమాంబట్టు ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ అందజేత



కంప్యూటర్ సామగ్రి అందజేస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

తడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నమాంబట్టు ఉన్నత పాఠశాలకు హిందూస్ కాఫీ పరిశ్రమ కంప్యూటర్ సామగ్రి అందజేసింది. మంగళవారం జరిగిన కార్యక్రమంలో కంప్యూటర్, సీపీయూ మానిటర్, ప్రింటర్ అందజేశారు. సీఎస్ఆర్ నిధులతో వీటిని సమకూర్చామని పరిశ్రమ ఏజీఎం రమేష్ తెలిపారు. పరిశ్రమ ప్రతినిధులను ఉపాధ్యాయులు శాలువాలతో సత్కరించింది. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో 20 మందికి గాయాలు

వాకాడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తేనెటీగల దాడిలో 20మందికి గాయపడిన ఘటన మండలంలోని రంగన్నగుంట వద్ద మంగళవారం జరిగింది. రోడ్డులో వెళ్తున్న ద్విచక్ర వాహనదారులపై ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. ఈ ఘటనలో 20మందికి పైగా గాయాలయ్యాయి. కొందరు వాకాడు ప్రభుత్వాస్పత్రికి, కొందరు కోటలోని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందారు.

మత్స్యకారుల జీవితాల్లో అక్షర దీపాలు

కోట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మత్స్యకార కుటుంబాల్లోని పిల్లల జీవితాల్లో అక్షరదీపాలు వెలిగించాలన్నదే శ్రీభారత్ ట్రస్టు ధ్యేయమని చైర్మన్ కొమారి కోటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని గోవిందపల్లిపాళెం మత్స్యకార గ్రామంలో శ్రీభారత్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాయంత్రం పాఠశాలను కోటేశ్వరరావుతో పాటు ట్రస్టు ప్రతినిధులు మంగళవారం సందర్శించారు. విద్యార్థులను విద్యాప్రమాణాలపై ఆరా తీశారు. విద్య ప్రాముఖ్యాన్ని స్థానికులకు వివరించారు. కార్యక్రమంలో పెదకాపు అక్కంగారి మస్తానయ్య, కొండూరు రంగయ్య, గోపాలయ్య, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సురేష్, సురేఖా తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల విద్యాప్రమాణాలను పరిశీలిస్తున్న శ్రీభారత్ ట్రస్టు చైర్మన్ కొమారి కోటేశ్వరరావు

రోడ్డుపై గుంతల పూడ్చివేత

చిట్టమూరు, నవంబర్ 4(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు సమీపంలో నాయుడుపేట - మల్లాం మార్గంలోని గుంతలను కొత్తగుంట యువకులు పూడ్చివేశారు. కొత్తగుంట ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డుపై పలుచోట్ల గుంతలు ఉండడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురౌతున్నారు. మంగళవారం చిట్టమూరు సర్పంచ్ కోటయ్య ఆధ్వర్యంలో కొత్తగుంట యువకులు సుధ, కోటి, రేవంత్ స్పందించి గుంతలను కాంక్రీట్‌తో పూడ్చివేశారు.

ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



వెంకటేశ్వరస్వామి ఆలయ నూతన పాలకమండలి సభ్యులు

గూడూరు అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజావీధిలో బుధవారం నిర్వహించనున్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ శ్రీకంటి రామమోహన్‌రావు అన్నారు. మంగళవారం ఆలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు. అమరయ్య నాయుడు, గోపాల్, రవీంద్రబాబు, మునేంద్ర, మునికోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు అభినందన



తహసీల్దారును అభినందిస్తున్న సుష్మారెడ్డి తదితరులు

కోట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోట తహసీల్దారు జయజయరావును టీడీపీ నాయకులు అభినందించారు. మొంథా తుఫాన్ సమయంలో విస్తృతంగా సహాయక చర్యలు చేపట్టిన జయజయరావు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రసంశా పత్రం అందుకున్న విషయం తెలిసిందే. మంగళవారం తెలుగు మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు గండవరం సుష్మారెడ్డితో పాటు తిన్నెలపూడి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శాలువాలు, పూలమాలలతో జయజయరావు అభినందించారు.

చిట్టేడులో కోటి సంతకాల సేకరణ

కోట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడులో మంగళవారం వైసీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మేరిగ మురళి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కొడవలూరు ధనంజయరెడ్డి, మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్‌రెడ్డి, నేదురుమల్లి హరిచంద్రారెడ్డి, ఎంపీపీ అంజమ్మ, రేష్మా, రాఘవరెడ్డి, నాగూర్‌రెడ్డి, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

మస్తాన్‌రెడ్డికి నెలవల పరామర్శ



మస్తాన్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ నెలవల

పెళ్లకూరు, నవంబరు, 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంబేడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మరుపూరు మస్తాన్‌రెడ్డిని సూళ్లూరుపేట ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పరామర్శించారు. ఇటీవల మస్తాన్‌రెడ్డి గుండెకు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. మంగళవారం నెలవల సుబ్రహ్మణ్యం మస్తాన్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. నెలవల వెంట టీడీపీ మండల అధ్యక్షుడు నంచి కృష్ణయ్య, చిల్లకూరు సొసైటీ డైరెక్టర్ పెళ్లకూరు గోపాల్‌కృష్ణ, నాయకులు మల్లికార్జునరెడ్డి, సుందరరామిరెడ్డి, మల్లు ప్రసాద్, రమేష్‌రెడ్డి, గుంటపూడి రమణయ్య తదితరులు ఉన్నారు.

రెట్టపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించండి

గూడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గూడూరు డిపో నుంచి చిల్లకూరు మండలం నెలబల్లిరెట్టపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో గూడూరు నుంచి రెట్టపల్లి గ్రామానికి నడిచే ఆర్టీసీ బస్సును రెండేళ్లుగా నిలిపివేయడం జరిగిందన్నారు. దీంతో గూడూరుకు రావాలంటే ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి రెట్టపల్లి, ఓడూరు, పునపువారిపాళెం గ్రామాలకు ఆర్టీసీ బస్సు నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శశికుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయంలో తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సాయిప్రసాద్, తహసీల్దారు ఇక్బాల్

వాకాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమూరు సచివాలయాన్ని ఎంపీడీవో సాయిప్రసాద్, తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే గురించి ఆరాతీశారు. త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. విధుల పట్ల ఎటువంటి అలసత్వం వహించవద్దని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హుస్సేన్‌బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నాయుడుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం చేకూరుతుందని నారాయణ పాఠశాలల ఏజీఎం నూర్ రియాజ్ అన్నారు. మంగళవారం నాయుడుపేటలోని పాఠశాలలో క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. విద్యార్థులకు రన్నింగ్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లికార్జున, ఏవో గౌస్ బాషా, కోఆర్డినేటర్ జన్నత్, డీన్‌లు శ్రీకాంత్, బాలా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

సూళ్లూరుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కడపత్ర, దామరాయి, కొరిడి పంచాయతీల్లో రైతులకు మంగళవారం యూరియా పంపిణీ చేశారు. మొత్తం 400 బస్తాల యూరియా రైతులకు అందజేశారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ఎకరాకు 3 బస్తాల చొప్పున యూరియా అందజేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయశాఖ సిబ్బంది చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయమకులు వెంకటేశ్వర్లు, తిరుపాల్, ప్రభాకర్, అక్కులయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు అర్బన్: రబీ సీజన్‌లో రైతులకు అవసరమైనంత యూరియాను అందుబాటులో ఉంచడం జరిగిందని వ్యవసాయశాఖ ఏడీ గోపినాయక్ మంగళవారం తెలిపారు. ఇప్పటికే 80శాతం మంది రైతులకు యూరియా గుర్తింపుకార్డులు అందజేయడం జరిగిందన్నారు. మిగిలిన రైతులకు కూడా కార్డులను ఇస్తామన్నారు.

విత్తన శుద్ధితో నాణ్యమైన దిగుబడి

వెంకటగిరి టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విత్తన శుద్ధితో నాణ్యమైన దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాఖ ఏడీఏ అనసూయ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిన్నపేట, ఉప్పరపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌లో ఎక్కడా యూరియా కొరత లేదని, ఏదైనా సమస్య ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో సుజాత, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ అనసూయ